


శివసూర్య
SHIVA SURYA TELUGU DAILY
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక




కర్నూలు సంపుటి : 04, సంచిక : 12 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/ మంగళవారం - 22 - సెప్టెంబర్ - 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



## జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణం: జూపల్లి

- హయాంలో జూరాల దగ్గర అదనపు రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదు
- వరద లేని పరిస్థితుల్లో గేట్లు ఎత్తితే తాగునీటికి ఇబ్బంది కాదా?
- "కేసీఆర్ గతంలో 20 టీఎంసీల గట్టు రిజర్వాయర్‌ను తీసుకొస్తామని చెప్పారు
- జూరాల, భీమా ఆయకట్టుకు సింగోటం నుంచి నీళ్లు తెస్తామన్నారు
- కేసీఆర్ హయాంలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 30 శాతానికి మించలేదు

# అభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో కుప్పం దూసుకెళ్తోంది..!

## కుప్పం బహిరంగ సభలో.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

- ★ జీవీఏలో 37 శాతం వృద్ధి.. తలసరి ఆదాయం 35 శాతం పెరుగుదల
- ★ పరిశ్రమల్లో రూ.9,872 కోట్ల పెట్టుబడులు.. 80,124 మందికి ఉపాధి లక్ష్యం
- ★ 'స్వర్ణ కుప్పం' దిశగా సమగ్ర అభివృద్ధి
- ★ కుప్పం బహిరంగ సభలో.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



చిత్తూరు జిల్లా కుప్పం: కుప్పం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి 'స్వర్ణ కుప్పం'గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కుప్పంలో రెండు రోజు పర్యటనలలో భాగంగా సోమవారం కొత్తపేటలోని ప్రజా వేదిక వద్ద స్వర్ణ కుప్పం సాధించి అమలులో దిశగా లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. మిగతా 2 లో

## చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని: హరీశ్ రావు

సిద్దిపేటలో తన భూముల పరిశీలనపై హరీశ్ రావు స్పందన



- వస్తున్నారని చెబితే తానే ఏర్పాట్లు చేసేవాడినని వ్యాఖ్య
- 3,000 మంది పోలీసుల మోహరింపుపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన హరీశ్
- తన ఆస్తులన్నీ అఫిడవిట్‌లో ప్రకటించానని స్పష్టీకరణ
- అబద్ధాలు ప్రచారం చేయొద్దని కాంగ్రెస్ నేతలకు హితవు

## 45 గంటలు.. నాలుగు రాకెట్లు.. 30 ఉపగ్రహాలు.. అంతరిక్ష రంగంలో చైనా దూకుడు



ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చిన నాలుగు రాకెట్లు

మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ప్రయోగాలు

రెండు రాకెట్లను అభివృద్ధి చేసిన ప్రైవేటు సంస్థలు

నాలుగు ప్రయోగాల్లో జరగని రాకెట్ దశల రికవరీ

# 'రౌడీయిజం చేసేవారి తోక కత్తిరిస్తాం'..

## టీచర్లపై దాడిని ఖండించిన చంద్రబాబు

టీచర్లపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం.

కఠిన చర్యలు తీసుకుంటాం



అమరావతి: విజయవాడలో స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైకాపా నేతల దాడిని ఏపీ సీఎం చంద్రబాబు ఖండించారు. ఫేక్ పార్టీ అందరినీ ఫేక్ అంటే సహించేది లేదన్నారు. "విజయవాడలో గురువులపై రౌడీలు దాడి చేస్తున్నారు. టీచర్లపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం. కఠిన చర్యలు తీసుకుంటాం. సాక్షి రిపోర్టర్.. టీచర్‌పై దాడి చేశారంటే వైకాపా ఎంత బరితెగించిందో అర్థం చేసుకోండి. అసెంబ్లీకి వచ్చి చర్చిస్తే సాక్ష్యాధారాలతో నోళ్లు మూయిస్తాం. చట్టబద్ధ ప్రక్రియపై కోర్టుకు వెళ్లొచ్చు.. కానీ దాడులేంటి? ఉపాధ్యాయులపై రౌడీలను ఎగదోయడమేంటి? గత పాలనలో పాలకులే రౌడీయిజం చేశారు.. దారుణాలకు పాల్పడ్డారు. కుప్పం వస్తే నన్ను కూడా ఇబ్బంది పెట్టారు. దౌర్జన్యాలకు దిగారు. రౌడీయిజం చేసేవారి తోక కత్తిరిస్తాం. రౌడీలు, విధ్వంసకారులను తరిమికొట్టే సత్తా కుప్పానికి ఉంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# చాలా ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం

## క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తాం

మంత్రి పొంగులేటి

- ★ రాయదుర్గంలో మల్కంచెరువు వెనుక 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన
- ★ "బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోలేదు
- ★ అధికారం పోయాక.. పేదల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారు



రాయదుర్గం: క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులందరికీ ఇల్లు వచ్చేవరకు ఈ పథకం విడతల వారీగా కొనసాగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గంలో మల్కంచెరువు వెనుక 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మిగతా 2 లో

## యుద్ధ మేఘాల నీడలో ఐరాస భేటీ.. మోదీ, జిన్‌పింగ్, పుతిన్ గైర్హాజరు



యుద్ధాల నడుమ ఐరాస ఉన్నత స్థాయి సమావేశాలు

ఈ భేటీకి ప్రధాని మోదీ, చైనా, రష్యా అధ్యక్షులు గైర్హాజరు

భారత్ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్ శనివారం ప్రసంగం

ఈసారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రమాదాలపై ప్రధానంగా చర్చ

అసలైన చర్చలు తెరవెనుక సమావేశాల్లోనే జరుగుతాయని వెల్లడి

ఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో తీవ్రమైన యుద్ధాలు, ఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి



## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు
- ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల
- పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు
- ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం
- 2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం.. మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్



- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు



## పోఖ్రాన్ ఆంక్షల తర్వాత మళ్లీ.. భారత్‌పై అమెరికా సుంకాల కత్తి

రష్యా చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అమెరికా కొత్త చట్టం

ఈ చట్టంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం

భారత్ నుంచి వచ్చే వస్తువులపై 100శాతం వరకు సుంకాలు విధించే అవకాశం

25 ఏళ్ల క్రితం నాటి పోఖ్రాన్ ఆంక్షల తరహా పరిస్థితులు పునరావృతం అవుతాయనే ఆందోళన

దేశ ఇంధన భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేసిన భారత ప్రభుత్వం

## రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా? రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

### ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్ చేశారన్న కేటీఆర్

- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం
- బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారని ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ



హైదరాబాద్: ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, మిగతా 2 లో

# టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..
## మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్

అమరావతి: విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు. రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాళ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?
## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్: ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాల్సింది పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని: హరీశ్ రావు

హైదరాబాద్: సిద్దిపేటలోని తన భూములను పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజన వసతి కల్పించి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై హరీశ్ రావు స్పందించారు. "ప్రేమ, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి సిద్దిపేట పెట్టింది పేరు. అటువంటి ప్రాంతానికి రావడానికి ఇంత భయమెందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.

### 45 గంటలు.. నాలుగు రాకెట్లు.. 30 ఉపగ్రహాలు..
## అంతరిక్షం రంగంలో చైనా దూకుడు

ఢిల్లీ: చైనా అంతరిక్ష రంగంలో దూకుడు పెంచుతోంది. కేవలం 45 గంటల వ్యవధిలో నాలుగు రాకెట్లను విజయవంతంగా ప్రయోగించింది. మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ఈ ప్రయోగాలు జరిగాయి. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో చేపట్టిన ఈ ప్రయోగాల్లో ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు కంపెనీల రాకెట్లు కూడా ఉన్నాయి. మొదటి ప్రయోగం సెప్టెంబర్ 15న జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి జరిగింది. ల్యాండ్‌స్పేస్ సంస్థకు చెందిన జుక్యూ-2ఈ రాకెట్ 10 ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. క్వియాన్‌ఫాన్ బ్రాడ్‌బ్యాండ్ మెగా శాటిలైట్ నెట్‌వర్క్ కోసం వీటిని పంపారు. ఈ నెట్‌వర్క్‌లో భవిష్యత్తులో దాదాపు 15 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. అదే రోజు షాంఘై సముద్ర తీరంలోని మొబైల్ ప్లాట్‌ఫామ్ నుంచి ఒరియెన్‌స్పేస్ గ్రావిటీ-1 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇది మరో తొమ్మిది క్వియాన్‌ఫాన్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. ఘన ఇంధనంతో పనిచేసే ఈ రాకెట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సాలిడ్ ఫ్యూయల్ రాకెట్‌గా గుర్తింపు పొందింది. మూడో ప్రయోగం హైనాన్ దీవిలోని వెన్‌చాంగ్ కేంద్రం నుంచి జరిగింది. ప్రభుత్వ రంగానికి చెందిన లాంగ్ మార్చ్-12 రాకెట్ తొమ్మిది ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపింది. ఇవి సాట్‌నెట్ పేరుతో ఏర్పాటు చేస్తున్న మరో భారీ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ కోసం ఉద్దేశించినవి. ఇందులో దాదాపు 13 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టే ప్రణాళిక ఉంది. నాలుగో ప్రయోగంతో ఈ వరుస ముగిసింది. జియుక్వాన్ నుంచి కుయ్‌జౌ-11 రాకెట్ రెండు రాడార్ భూ పరిశీలన ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. మొత్తంగా నాలుగు ప్రయోగాల్లో 30 ఉపగ్రహాలను చైనా కక్ష్యలోకి పంపింది. ఈ నాలుగు ప్రయోగాలు చైనా అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర పెరుగుతున్న విషయాన్ని కూడా చూపించాయి. అయితే ఈ నాలుగు ప్రయోగాల్లో ఏ రాకెట్ బూస్టర్‌ను తిరిగి భూమికి తీసుకురాలేదు. కాగా, జుక్యూ-3, లాంగ్ మార్చ్-10బీ రాకెట్ల తొలి దశలను విజయవంతంగా ల్యాండ్ చేసి పునర్వినియోగ సాంకేతికతలో చైనా ముందడుగు వేసింది.

### యుద్ధ మేఘాల నీడలో ఐరాస భేటీ..
## మోదీ, జిన్‌పింగ్, పుతిన్ గైర్హాజరు



ఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో తీవ్రమైన యుద్ధాలు, ఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వార్షిక ఉన్నతస్థాయి సమావేశాలు ఈ వారం ప్రారంభం కానున్నాయి. ఈ కీలక భేటీకి 140 మంది ప్రపంచ నేతలు, మరో 53 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు, ఉక్రెయిన్ యుద్ధం, గాజాలో సంక్షోభం, సూడాన్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం వంటి అంశాలు ఈ సమావేశాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. నేడు ఈ సమావేశాలు ప్రారంభం కానుండగా, సంప్రదాయం ప్రకారం బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా తొలి ప్రసంగం చేయనున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తారు. అయితే, ఈసారి సమావేశాలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి ముగ్గురు కీలక నేతలు గైర్హాజరవుతున్నారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ శనివారం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 'విశ్వాసాన్ని పునరుద్ధరించడం, పరివర్తనను నిర్వహించడం: అందరి కోసం పనిచేసే ఐరాస' అనే థీమ్‌తో ఈ ఏడాది సమావేశాలు జరగనున్నాయి. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, ప్రపంచ ఆకలి, పేదరికం వంటి శాశ్వత సమస్యలతో పాటు ఈసారి కృత్రిమ మేధ (ఏఐ)తో ముంచుకొస్తున్న ప్రమాదాలపై కూడా ప్రధానంగా చర్చించనున్నారు. ఐరాస సర్వప్రతినిధి సభ అధ్యక్షుడిగా ఎన్నికైన బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రెహమాన్ ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. ప్రధాన సభలో నేతల ప్రసంగాలు లాంఛనప్రాయంగా సాగినా, అసలైన చర్చలు, దౌత్యపరమైన మంతనాలు మాత్రం తెరవెనుకే జరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. గత ఏడాది ఇలాంటి సమావేశాల సందర్భంగానే అమెరికా, కొన్ని ముస్లిం దేశాల మధ్య జరిగిన చర్చల ఫలితంగా గాజా శాంతి ప్రణాళిక రూపుదిద్దుకుందని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంలో ఐరాసను విమర్శించే ట్రంప్ కూడా ఏకీభవించడం గమనార్హం. ఈ సమావేశాల్లో కొన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగం చేసిన మరుసటి రోజే, ఆ దేశ ప్రత్యర్థి అయిన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ప్రసంగించనుండటం ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు గాజాలో తమ చర్యలను సమర్థించుకోవడానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గురువారం ప్రసంగించనుండగా, పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌కు అమెరికా వీసా నిరాకరించడం వివాదాస్పదంగా మారింది.

# అభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో కుప్పం దూసుకెళ్తోంది..!

మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం నాయుడు,జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,యు డి ఎ చైర్మన్ సురేష్ బాబు, లబ్ధిదారులు సురేఖ, సుబ్రహ్మణ్యం, విక్కీ విఘ్నేష్, వెంకటలక్ష్మి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 8,904 బంగారు కుటుంబాలను గుర్తించి వారికి పీ4 కార్యక్రమం ద్వారా సహకారం అందిస్తున్నాం. కుప్పాన్ని పేదరికం లేని నియోజకవర్గంగా మార్చటమే నా లక్ష్యం. కుప్పంలో ఎక్కడా చెత్త కనిపించకుండా చేయాలన్నది మా ఆలోచన.82 ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా కుప్పంలో చెత్త నుంచి కాంపోస్టు తయారు చేయిస్తున్నాం.నెట్ జీరో కుప్పంగా ఈ నియోజకవర్గాన్ని తయారు చేస్తాం.ఆస్పత్రి, కాలేజి, పాఠశాల, ప్రభుత్వ కార్యాలయం ఇలా అన్నీ నెట్ జీరో కావాలి. సోలార్ రూఫ్ టాప్ తో ప్రతీ ఇల్లూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలి సంజీవని ప్రాజెక్టులో భాగంగా పౌరుల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నాం... ఇదో గేమ్ ఛేంజర్. అందరి ఆరోగ్యాన్ని పరీక్షించేలా సంజీవని ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నాం. కుప్పంలో ఇప్పటికే వివిధ రకాల పరీక్షలను నిర్వహించి డిజిటల్ హెల్త్ రికార్డులను నమోదు చేసి చికిత్సలు అందిస్తున్నాం.13 పీహెచ్సీలు, ఏరియా ఆస్పత్రులతో 1.29 లక్షల మందికి కుప్పంలో సేవలు అందిస్తున్నాం. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రంలోని 5 కోట్ల మంది ఆరోగ్యాన్ని పరిరక్షించేలా చర్యలు చేపడుతున్నాం. శ్రీవాణి ట్రస్టు రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల దేవాలయాల నిర్మాణాన్ని చేపడుతున్నాం... కుప్పంలోనూ ఓ ఆలయాన్ని నిర్మిస్తాం. అర్హులందరికీ ఇళ్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ేఎ ద ల క ు పట్టాభిషేకం పేరుతో ఇల్లు - ఇంటి జాగా ఇచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. కంగుందిలో దశాబ్దాల పాటు పరిష్కారం కాని భూ సమస్యను పరిష్కరించి 320 మందికి పట్టాలు ఇచ్చాం. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో మీ భూమి- మీ హక్కు పేరిట రాజ ముద్రతో కూడిన పట్టాలు జారీ చేస్తున్నాం.

విజయాలను ప్రస్తావించిన సీఎం చంద్రబాబు

కష్టపడితే సొంత ప్రాంతంలోనే ఉపాధి పొందుతూ ఉన్నతంగా ఎదగవచ్చని, సృజనాత్మక ఆలోచనలతో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చని కుప్పం యువత నిరూపిస్తోంది. సోమవారం కుప్పం నియోజకవర్గ కేంద్రంలోని కొత్తపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముగ్గురు యువత సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ వారిని అభినందించారు.

సొంత ఊరిలోనే ఉద్యోగం.. సురేఖ సక్సెస్...

పొగురుపల్లికి చెందిన సురేఖ డిగ్రీ పూర్తి చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటైన అవీస్ కంపెనీలో పర్యవేక్షకురాలిగా ఉద్యోగం పొందారు. ఉద్యోగం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత గ్రామానికి సమీపంలోనే ఉపాధి లభించడంతో తన తల్లిదండ్రులు కూడా ధైర్యంగా తనను ఉద్యోగానికి పంపుతున్నారని ఆమె ముఖ్యమంత్రితో తెలిపారు. ఉద్యోగం చేస్తూనే తన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఎంబీఏ చదువుతున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. సురేఖ కథను ప్రస్తావించిన ముఖ్యమంత్రి.. స్థానికంగా పరిశ్రమలు రావడం వల్ల మహిళలు, యువతకు సొంత ప్రాంతంలోనే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. యువత తమ నైపుణ్యాలను పెంచుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువ పారిశ్రామికవేత్తగా సుబ్రహ్మణ్యం..

కుప్పం ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించేలా పారిశ్రామిక కార్యకలాపాలను అభివృద్ధి చేస్తున్న సుబ్రహ్మణ్యం కృషిని కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఒకసారి విజయాన్ని సాధించిన తర్వాత అదే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తే మరింత ముందుకు వెళ్లవచ్చని అన్నారు. కుప్పం ప్రాంత వ్యవసాయ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా మార్కెట్ చేసే స్థాయికి తీసుకెళ్లేందుకు స్థానిక యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. "ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త" అనే ఆలోచనను కుప్పం నుంచే ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సుబ్రహ్మణ్యం వంటి యువత ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు.

సృజనాత్మకతతో సోషల్ మీడియాలో విక్కీ విఘ్నేష్..

కుప్పం అభివృద్ధిని సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళుతున్న యువకుడు విఘ్నేశ్ (విక్కీ) కృషిని కూడా ముఖ్యమంత్రి అభినందించారు. సృజనాత్మక ఆలోచనలతో వీడియోలు రూపొందిస్తూ కుప్పం అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక ప్రత్యేకతలను ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియా ప్రచారం ద్వారా విఘ్నేశ్ నెలకు సుమారు రూ.లక్ష వరకు ఆదాయం పొందుతున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వ్యక్తిగతంగా ఆదాయం సంపాదించడంతో పాటు తన ప్రాంత అభివృద్ధిని ప్రచారం చేయడం ద్వారా విఘ్నేశ్ రెండు విధాలుగా ప్రయోజనం చేకూరుస్తున్నారని అన్నారు.

### ముగ్గురి ప్రయాణం.. యువతకు సందేశం..

సురేఖ ఉద్యోగం సాధించి ఉన్నత విద్యను కొనసాగిస్తుండగా.. సుబ్రహ్మణ్యం పారిశ్రామిక రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. విఘ్నేశ్ సృజనాత్మకతను ఉపాధిగా మార్చుకుని, అదే సమయంలో కుప్పం అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. వీరి విజయాలు యువతకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయని కార్యక్రమంలో పేర్కొన్నారు. ఉద్యోగం కోసం ఎదురుచూడటమే కాకుండా.. నైపుణ్యాన్ని పెంచుకోవడం, వ్యాపార ఆలోచనలను ఆచరణలో పెట్టడం, సృజనాత్మకతతో కొత్త అవకాశాలను సృష్టించుకోవడం ద్వారా స్వయం ఉపాధితో పాటు మరెందరికో ఉపాధి కల్పించవచ్చనే విషయాన్ని ఈ ముగ్గురి విజయాలు చాటుతున్నాయి. కుప్పం యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు, వారికి ఉపాధి, పారిశ్రామిక, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి తెలిపారు.

### పోఖ్రాన్ ఆంక్షల తర్వాత మళ్లీ..
## భారత్‌పై అమెరికా సుంకాల కత్తి

ఢిల్లీ: భారత్-అమెరికా వ్యూహాత్మక, వాణిజ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి అధిక మొత్తంలో ముడి చమురు, సహజ వాయువు దిగుమతి చేసుకునే దేశాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పించే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం నిబంధనలు పాటించని దేశాల నుంచి వచ్చే వస్తువులపై 100శాతం వరకు భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లభిస్తుంది. ఈ పరిణామం రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహం పేరు మీద "లిండ్సే ఒ. గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026" పేరుతో ఈ చట్టాన్ని రూపొందించారు. అమెరికా సెనేట్, ప్రతినిధుల సభలో ఈ బిల్లుకు డెమొక్రాట్లు, రిపబ్లికన్లు అనే తేడా లేకుండా ఉభయపక్షాల మద్దతు లభించింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన 30 రోజుల్లోగా రష్యా నుంచి ముడి చమురు లేదా గ్యాస్ కొనుగోలు చేస్తున్న మొదటి ఐదు దేశాలలో ఒకటిగా ఉండి, తమ దిగుమతులను తగ్గించుకోని పక్షంలో ఆ దేశంపై సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి అధికారం ఉంటుంది. గత కొన్నేళ్లుగా భారత్, రష్యా నుంచి చౌక ధరలకు లభించే ముడి చమురును భారీగా కొనుగోలు చేస్తోంది. కొన్ని నెలల్లో అయితే, భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో సగానికి పైగా రష్యా నుంచే రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో అమెరికా తాజా చట్టం భారత్‌ను నేరుగా లక్ష్యం చేసే ప్రమాదం ఉంది. ఈ పరిణామంపై భారత అధికారులు స్పందిస్తూ, దేశ ప్రజల ఇంధన భద్రతకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. మార్కెట్‌లో లభ్యత, అందుబాటు ధర, ఇతర పరిస్థితులను బట్టే చమురు కొనుగోళ్లపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. అయితే, ఈ కొత్త చట్టం వల్ల ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం పడే అవకాశం ఉందని భారత విదేశాంగ శాఖ అభిప్రాయపడింది. దాదాపు 25 ఏళ్ల క్రితం 1998లో భారత్ నిర్వహించిన పోఖ్రాన్-II అణు పరీక్షల అనంతరం అప్పటి అమెరికా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. ఆ తర్వాత జార్జ్ డబ్ల్యూ. బుష్ హయాంలో ఆ ఆంక్షలను ఎత్తివేశారు. ఇప్పుడు మళ్లీ ఇన్నేళ్ల తర్వాత అమెరికా నుంచి ఇలాంటి కఠినమైన వాణిజ్యపరమైన చర్యల ముప్పు పొంచి ఉండటం వ్యూహాత్మక, వాణిజ్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కొత్త చట్టం ఇరు దేశాల మధ్య నెలకొన్న బలమైన భాగస్వామ్యానికి కొత్త పరీక్షగా నిలవనుంది.

### చాలా ఖరీదైన ప్రాంతాల్లో
## ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం.. మంత్రి పొంగులేటి




రాయదుర్గం: క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులందరికీ ఇల్లు వచ్చేవరకు ఈ పథకం విడతల వారీగా కొనసాగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని రాయదుర్గంలో మల్కంచెరువు వెనుక 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇల్లు కేటాయింపు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోలేదు. అధికారం పోయాక.. పేదల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారు. గత ప్రభుత్వం నగరానికి దూరంగా.. ప్రజలు ఉండలేని చోట ఇళ్లు నిర్మించింది. మేం రద్దీగా ఉండే, చాలా ఖరీదైన ప్రాంతాల్లో టవర్స్ నిర్మించి, ఇళ్లు ఇస్తున్నాం. పేదలయితే చాలు.. ఏ పార్టీ వారు అని చూడకుండా ఇల్లు మంజూరు చేస్తున్నాం. వచ్చే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం ప్రారంభిస్తాం" అని తెలిపారు.

ఎల్3 కేటగిరీపై కీలక నిర్ణయం

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి విచారణలో అనర్హులుగా తేలిన వారిని అధికారులు ఎల్3 కేటగిరీలో పెట్టిన విషయం తెలిసిందే. అయితే.. ఎల్3 కేటగిరీలో ఉన్నప్పటికీ ఇల్లు నిర్మాణం ప్రారంభించినవారికి ప్రత్యేక అనుమతి ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఎల్3లో ఉన్నప్పటికీ.. బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఇళ్లు మంజూరై నిర్మాణం ప్రారంభం కాని అనర్హులకు రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఎల్3 కేటగిరీలోని అనర్హులకు రద్దు చేసి అర్హులకు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

### జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి
## బీఆర్ఎస్సే కారణం: జూపల్లి




జూరాల: జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జూరాల దగ్గర అదనపు రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాలలో ఆయన ఈమేరకు మాట్లాడారు. వరద లేని పరిస్థితుల్లో గేట్లు ఎత్తితే తాగునీటికి ఇబ్బంది కాదా? అని ప్రశ్నించారు. "కేసీఆర్ గతంలో 20 టీఎంసీల గట్టు రిజర్వాయర్‌ను తీసుకొస్తామని చెప్పారు. జూరాల, భీమా ఆయకట్టుకు సింగోటం నుంచి నీళ్లు తెస్తామన్నారు. పాలమూరుపై అంత ప్రేమ ఉంటే రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదు? కేసీఆర్ రిజర్వాయర్లు కట్టకపోవడం వల్లే నీళ్లను నిల్వ చేసుకోలేకపోతున్నాం. పాలమూరు జిల్లాను ఎండబెట్టే ప్రయత్నం చేశారు. కేసీఆర్ హయాంలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 30 శాతానికి మించలేదు. మా ప్రభుత్వంలో ఈ వాటా 43 శాతం వరకు ఉంది. నీటి కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ సర్కారు రాజీపడదు. 15 టీఎంసీలతో గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు ఇచ్చాం. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి ఇంకా నీళ్లు వస్తాయని భావిస్తున్నాం. ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లను సరైన పద్ధతిలో ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాం. వచ్చే సీజన్‌కు నీటి ఎద్దడి లేకుండా చేస్తాం" అని అన్నారు.

### కుప్పంలో సీఎం చంద్రబాబు సుడిగాలి పర్యటన..
## వందల కోట్ల పనులకు శ్రీకారం




అమరావతి: తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించిన సీఎం చంద్రబాబు నాయుడు, నియోజకవర్గాన్ని 'స్వర్ణ కుప్పం'గా తీర్చిదిద్దే దిశగా వందల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఒకే రోజు పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో ఆయన పర్యటన బిజీబిజీగా సాగింది. పర్యటనలో భాగంగా రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆర్డీఓ, ఏఎస్పీ కార్యాలయాల భవనాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కుప్పం మున్సిపాలిటీలో రూ.38 కోట్ల విలువైన వివిధ ప్రభుత్వ పనులకు భూమిపూజ నిర్వహించారు. రూ.3.30 కోట్లతో పూర్తిచేసిన సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను, మెటీరియల్ రికవరీ కేంద్రాన్ని ప్రారంభించారు. మల్లనూరులో 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.70 కోట్లతో చేపట్టనున్న జూనియర్ కళాశాల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. దీంతోపాటు వ్యవసాయ ఫీడర్ల కోసం ఉద్దేశించిన 15 మెగావాట్ల పీఎం కుసుమ్ సోలార్ ప్రాజెక్టులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యమే శ్రీరామరక్ష.. రైతులకు సీఎం పిలుపు

అనంతరం 'స్వర్ణ కుప్పం' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న చంద్రబాబు, పలువురు లబ్ధిదారులతో నేరుగా సంభాషించారు. హంద్రీనీవా కాలువ ద్వారా లబ్ధి పొందిన రైతుతో మాట్లాడుతూ.. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని హితవు పలికారు.

"వాతావరణ సమతుల్యం దెబ్బతినడం వల్లే ఎల్ నినో వంటి పరిస్థితులు ఏర్పడి వర్షాభావం నెలకొంది. దీనివల్ల కృష్ణా, గోదావరి నదులకు నీరు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సేంద్రీయ ఎరువులు, బయోచార్ వంటి విధానాలతో భూసారాన్ని పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం. ప్రకృతి సేద్యం శ్రీరామరక్ష అనే విధానాన్ని పాటిద్దాం" అని రైతులకు పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచుదామని అన్నారు. భూములను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచిస్తూ, కరవు నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్త

ఈ సందర్భంగా పీ4 కార్యక్రమం కింద లబ్ధి పొందిన లక్ష్మి అనే మహిళ తన అనుభవాలను పంచుకున్నారు. ప్రభుత్వం, టీవీఎస్ సంస్థ సహకారంతో ఇటుకల బట్టీ ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తగా మారానని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన చంద్రబాబు.. "ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే మా కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని స్పష్టం చేశారు. టీవీఎస్, అదానీ, మెగా వంటి సంస్థలు 8900 కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికంగా నిలబెడుతున్నాయని అభినందించారు. అలాగే, కుప్పంలోని ఓ కంపెనీలో ఉద్యోగం పొందిన సురేఖ అనే యువతిని అభినందిస్తూ, ప్రతి కుటుంబంలోనూ స్టార్టప్‌లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రావాలని ఆకాంక్షించారు.

### రామ మందిరంలో భారీ కుంభకోణం
## 105 సార్లు విరాళాల చోరీ



ఢిల్లీ: అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టుకు సిట్ తన నివేదికను సమర్పించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసుకు సంబంధించిన సిట్ నివేదికలోని కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా విరాళాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసి, ఆ నగదును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరుస్తారు. అయితే, ఈ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం దర్యాప్తు తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని మెహతా కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ ఉన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో రామ్ మందిర్ ట్రస్టులో కీలక మార్పులు చేశారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు తప్పుకున్న అనంతరం, ఆలయ పరిపాలన కోసం సీఈఓ నేతృత్వంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నూతన సీఈఓగా నియమించారు. కాగా, సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

## మెళియాపుట్టిలో కోతుల బెడదపై అధికారుల స్పందన - ఒక కోతి పట్టివేత



మెళియాపుట్టి, శివ సూర్య,సెప్టెంబర్ 21:మెళియాపుట్టి మండల కేంద్రంలో కోతుల బెడదపై 'శివ సూర్య' పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు.గత కొద్ది రోజులుగా వంద మందికి పైగా ప్రజలపై కోతులు దాడి చేసి గాయపరచిన విషయం తెలిసిందే. ఈ విషయంపై స్థానికులు ఆందోళన వ్యక్తం



చేయడంతో, సోమవారం అటవీ శాఖ అధికారులు మెళియాపుట్టికి చేరుకున్నారు.మెళియాపుట్టి పంచాయతీ కార్యదర్శి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి, ప్రజలపై దాడి చేస్తున్న కోతుల్లో ఒక కోతిని పట్టుకున్నారు. పట్టుబడిన కోతిని అడవిలో వదిలేందుకు తరలించారు.మిగిలిన కోతులను కూడా త్వరలోనే పట్టుకుని అడవిలో వదిలేస్తామని, ప్రజలు భయాందోళన చెందవద్దని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పత్రికకు, స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి 10 లక్షల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే ఎంజీఆర్

---- ప్రమాద బీమా ద్వారా రూ.5,00,00లక్షలు, విద్యుత్ శాఖ ఎక్స్‌గ్రేషియాగా మరో రూ.5,00,000/- లక్షలు



మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 21: పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం మెట్టూరు గ్రామానికి చెందిన మండూరి ప్రకాష్ రావు ప్రైవేట్ ఎలక్ట్రీషన్‌గా జీవనోపాధి కొనసాగిస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు.ఈ విషయాన్ని స్థానిక నాయకులు ద్వారా పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు దృష్టికి తీసుకురాగా, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. తెలుగుదేశం ప్రభుత్వం సభ్యత్వం కార్డు ప్రమాద బీమా పథకం ద్వారా గతంలో రూ.5,00,000/- లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే విద్యుత్ శాఖ తరఫున మరో రూ.5,00,000/- లక్షల ఎక్స్‌గ్రేషియా పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో మండూరి ప్రకాష్ రావు కుటుంబానికి మొత్తం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందింది.కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కి, ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కి, రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కి అలాగే స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టాల్లో ప్రభుత్వం అండగా నిలుస్తూ, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు.

## శ్రీ పుట్ట రాజ స్వామి వారి 16వ వర్ధంతి పుణ్యతిథి కార్యక్రమం..!

ముఖ్య అతిథిగా గోవిందు గౌడ్



హొళగుంద శివ సూర్య న్యూస్ సెప్టెంబర్ 21: స్థానిక మండలంలోని శ్రీ పుట్ట రాజ స్వామి వారి 16వ వర్ధంతి పుణ్యతిథి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీ ఈడిగ గోవింద్ గౌడ్ గారిని, శ్రీ మారికోటూరు శ్రీధరగడే స్వామి గారి చేతుల మీదుగా శాలువా, హారాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామి వారి ఆశీస్సులు గోవింద్ గౌడ్ గారికి అందించారు.ఈ కార్యక్రమాన్ని పుట్టరాజ స్వామి సేవా ట్రస్ట్ మరియు గ్రామ భక్త బృందం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 60 లక్షల టీటీడీ దేవస్థానం శ్రీవారి నిధులతో శ్రీ ఉదికల పోలమ్మ తల్లి శ్రీ అభయ అంజినేయ స్వామి ఆలయ నిర్మాణం

---టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే

---ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన గ్రామ నాయకులు, కార్యకర్తలు



మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 21: పాతపట్నం మండలం వెంకటాపురం, ద్వారకపురం గ్రామంలో నూతన శ్రీ శ్రీ శ్రీ ఉదికల పోలమ్మతల్లి, శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయాల నిర్మాణం కోసం టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.60,00,000/- లక్షల నిధులు మంజూరు చేయించినందుకు పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు కి గ్రామ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో నూతన ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆలయాల నిర్మాణంతో ఆ ఆ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందడంతో పాటు, భక్తులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయని నాయకులు తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామాల అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా సహకారం అందిస్తూ నిధులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చూపుతున్న చొరవ అభినందనీయమని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వసప గ్రామ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ని కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు, టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌కు గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

# "కాఫీ విత్ ఎమ్మెల్యే"కార్యక్రమం ప్రజల సమస్యల తెలుసుకొని పరిష్కారం కోసమే

--- గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై నాయకులతో ఎమ్మెల్యే ముఖాముఖి చర్చ

--- కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట -- ఎమ్మెల్యే

--- ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా చర్యలు

--- రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యం




మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 21: పాతపట్నం శాసనసభ్యులు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు పాతపట్నం టిడిపి కేంద్ర కార్యాలయంలో 'కాఫీ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహించారు. పాతపట్నం మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన నాయకులతో ముఖాముఖిగా



సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు సంబంధించిన ప్రజా సమస్యలు, గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కూడా నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్లు, మహిళలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పలు కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.పింఛన్ల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి పారదర్శకంగా పింఛన్ అందేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామస్థాయిలో నాయకులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు 'కాఫీ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమం ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుందని తెలియజేశారు. గ్రామాల వారీగా సమస్యలను తెలుసుకుని, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడంతో పాటు అభివృద్ధి అవసరాలను గుర్తించి ముందుకు సాగుతామని అన్నారు.రాబోయే రోజుల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజలు, నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పైన బాబ్జి, పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మెళియాపుట్టిలో ఘనముగా గురజాడ అప్పారావు జయంతి వేడుకలు



మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 21: మెళియాపుట్టి మండల కేంద్రం గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సామాజిక సాంఘిక సంస్కర్త గురజాడ జయంతి సందర్భంగా సోమవారం మెళియాపుట్టి మండల కేంద్రం గ్రంథాలయంలో ఆర్ అనురాధ ఆధ్వర్యంలో నివాళాలు అర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అనపాన రాజశేఖర్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ...., దేశమంటే మట్టి కాదోయ్- దేశమంటే మనుషులోయ్!"అనే నినాదాన్ని గురజాడ కవి చాతుర్యాన్ని గుర్తు చేశారు. తెలుగు సాహిత్యానికి ఆధునిక దిశానిర్దేశం చేసిన మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పించిసమాజంలోని మూఢనమ్మకాలు, అసమానతలను ప్రశ్నిస్తూ, ప్రజల్లో చైతన్యం నింపిన గురజాడ రచనలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.గురజాడ ఆశయాలను కొనసాగిద్దాం -- సమాజ అభ్యున్నతికి పాటుపడదాం అని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సర్పంచ్ ప్రతినిధి రేఖనా వాసు,మండల ఐటీడీపీ అధ్యక్షులు దుక్క శంకర్ రెడ్డి, హైస్కూల్ ఛైర్మన్ బురగాన చిన్నబాబు, పాఠకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదినం.



గట్టు (శివసూర్య )బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా అంగన్వాడి కేంద్రాలలో 5 సెంటర్ లలో పలకలు బలపాలు పండ్లు బిస్కెట్ పంపిణీ కార్యక్రమం.అనంతరం కేక్ కట్ చేసి జన్మదినం శుభాకాంక్షలు తెలిపారు.గట్టు మండల మాచర్ల గ్రామ నాయకులు యూత్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలోని మాచర్ల గ్రామంలో 5సెంటర్ లలో 103 మంది పిల్లలు కు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా అంగన్వాడి కేంద్రాలకు 103 పలకలు బలపాలు పండ్లు బిస్కెట్ పంపిణీ చేశారు.జన్మదినం సందర్భంగా గద్వాల శాసనసభ్యులు శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి ఆయురారోగ్యాలతో గద్వాల నియోజకవర్గాన్ని ప్రజలకు నిరంతరం అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఒక్కసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో మాచర్ల గ్రామ మాజీ సర్పంచ్ సిద్దరామప్ప గట్టు మండల మైనారిటీ అధ్యక్షుడు యం డి అలీ, సురేష్, శ్రీనివాస్ రెడ్డి, రాజు గౌడ్ గట్టు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆనంద్ ,ఊరుకుందు వార్డ్ మెంబర్ వడ్ల వీరేశ్ తిమ్మప్ప,సహకార సంఘం డైరెక్టర్లు నాగెల్లి అంపన్న, సుగురు నర్సింహులు, ముక్కరయ్య,అయ్యప్ప బీమేశ్ జంబన్న రంగన్న గౌడ్ వడ్ల నర్సింహులు వినోద్ కుమార్ శెట్టి జాకీ జంబన్న గౌస్ మోహన్ గట్టు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యం డి మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పుట్టినరోజున మొక్కలు నాటిన సర్పంచ్ వజ్రమ్మ.



గట్టు (శివసూర్య )మాచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర గ్రామ సర్పంచ్ బి వజ్రమ్మ తిమ్మప్ప గద్వాల శాసనసభ్యులు శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరిపారు.మొదట కేక్ కటింగ్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో జీవితకాలం ఉండాలని గద్వాలజిల్లా ప్రజలపై ఇదేవిధంగా ప్రేమానురాగాలు చూపించాలని కోరారు. పుట్టినరోజును పురస్కరించుకొని పంచాయతీ ఆఫీసు ముందు మరియు జిల్లా పరిషత్ హై స్కూల్లో మొక్కలను కూడా నాటారు.అదేవిధంగా మాచర్ల గ్రామంలో ఉన్నటువంటి అన్ని అంగన్వాడి సెంటర్లలో పిల్లలకు పలకలను మరియు పండ్లు పంపిణీ చేశారు. గద్వాల శాసనసభ్యులు




కలకాలం నిండు నూరేళ్లు జీవించాలని ఆంజనేయస్వామి గుడి దగ్గర కొబ్బరికాయలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్, లోకేష్,తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కుటుంబానికి ఐజ చేనేత సహకార సంఘం ఆర్థిక సహాయం.



అయిజ(శివసూర్య ) మున్సిపాలిటీ పరిధిలోని కనికపేటకు చెందిన చేనేత కళాకారుడు కనికే నరసింహులు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల ఐజ చేనేత సహకార సంఘం పాలకవర్గం సంతాపం వ్యక్తం చేసింది.చేనేత కళాకారుడి కుటుంబానికి అండగా నిలిచేందుకు ఐజ చేనేత సహకార సంఘం తరఫున అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు డాన్ వీరన్న, కార్యదర్శి పసలాది బసవరాజు, కోశాధికారి కసా వెంకటేష్, డైరెక్టర్ రియాజుద్దీన్, మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొని, మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.చేనేత కార్మికులు, కళాకారుల సంక్షేమానికి తమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు తెలిపారు.

## అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన

శాసనసభ్యులు మామిడి గోవిందరావు

---విద్యార్థుల వసతులు, భోజనం, పరిశుభ్రతపై స్వయంగా పరిశీలించారు

-- సమస్యలపై అధికారులను ఆరా తీసిన ఎమ్మెల్యే ఎంజీఆర్

----విద్యార్థుల సంక్షేమం, భద్రత విషయంలో నిర్లక్ష్యం సహించేది లేదు

-- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు





మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 21: పాతపట్నం కేంద్రంలోని అంబేద్కర్ గురుకులం పాఠశాల రెసిడెన్షియల్ హాస్టల్, జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన ఫిర్యాదులు, హాస్టల్ నిర్వహణకు సంబంధించి వచ్చిన అభియోగాల నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, తాగునీరు, పరిశుభ్రత, వసతి గదులు తదితర అంశాలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. అలాగే విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.తల్లిదండ్రుల నుంచి



వచ్చిన ఫిర్యాదులు, విద్యార్థులు తెలిపిన సమస్యలపై సంబంధిత సిబ్బంది, అధికారులను ఎమ్మెల్యే ఆరా తీశారు.విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, హాస్టల్‌లో పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల సంక్షేమం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని, తల్లిదండ్రుల ఫిర్యాదులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులతో మాట్లాడతామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు.

## రాజుపేటలో మహా అన్నదానం



మంగపేట, సెప్టెంబర్ 21మంగపేట మండలం రాజుపేటలోని న్యూ ఇండియన్స్ యూత్ రవి చెట్టు సెంటర్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం మహా అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.అత్యంత వైభవంగా సాగిన అన్న దాన మహా ప్రసాదం కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నదాన ప్రసాదంను స్వీకరించారు. యడ్లపల్లి నరసింహ రావు,వల్లిపల్లి శివ ప్రసాద్,కోడెం రాంబాబు,గోదా శ్రీనివాస్ రెడ్డి,సూర్య దేవర సాయి,ముళ్ల పూడి శ్రీనివాస్ రావు,చిలకాల చంద్ర శేఖర్,ముళ్లపూడి సత్యనారాయణ,సున్నం అనిల్,మాల్ రెడ్డి నాగేందర్ రెడ్డి,ఆము దాలపల్లి హేమంత్, జలసూత్రం రాజేష్,అన్న దాన కార్యక్రమంను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృత జ్ఞతలు తెలిపారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి.

### ----- పట్టణ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింత గోపాల్.



, సంగారెడ్డి ప్రతినిధి ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింత గోపాల్ ఆధ్వర్యంలో బాపూజీ గారి విగ్రహమునకు పూలదండలు పూజా కార్యక్రమాలు



సమర్పించి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యక్షులు చింత ఆనంద్ కుమార్, కార్యదర్శి చిల్వేరి వెంకటేశం, డైరెక్టర్లు గోనె శంకర్, చిలువేరి రవికుమార్, గడీల ప్రభాకర్, రుమాండ్ల రాజు, ముర్మురా శ్రీనివాస్, డాకూరి అశోక్, చింతా ఆదర్శ్, మునిపల్లి రామకృష్ణ, పోలా విజయ్, గుణాల సత్యం, మధునాల నర్సింలు, కొంగరి ప్రభు, తదితర పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి పనుల పరిశీలన



పటాన్‌చెరు, సంగారెడ్డి ప్రతినిధి సంగారెడ్డి జిల్లా,పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎస్సీ (రాజ) ఇలేష్, డీఈ (ఐజు) రవీందర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. మార్కెట్ యార్డుకు విచ్చేసిన అధికారులకు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏపూరి శివానందం, ఈవో సునీల్, వైస్ ఛైర్మన్ మాదాస్ రాజశేఖర్ ఘనంగా స్వాగతం




పలికారు.?అనంతరం అధికారులతో కలిసి మార్కెట్ యార్డు ఆవరణలో రూ.13 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న నూతన దుకాణాల నిర్మాణ పనులను, రూ.6.70 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.?ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... పటాన్‌చెరు మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు, వ్యాపారులకు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి ఛైర్మన్ శివానందం విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, డైరెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కలంతోనే కాదు.. రక్తంతోనూ ప్రాణరక్షణ!

### టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి జన్మదినం సందర్భంగా బృహత్తర సేవా సంకల్పం



,సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 22న సంగారెడ్డి ఐబీలో భారీ రక్తదాన శిబిరం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం.. ప్రాణదాతలుగా నిలవాలని పిలుపు "మన బలం.. మన కలం.. మన రక్తం.. ఒకరి ప్రాణం" నినాదంతో నిర్వహణస్ఫూర్తి నినాదం:"మీరు చేసే ఒక్క రక్తదానం.. ఒక ప్రాణానికి పునర్జన్మ""మన బలం.. మన కలం.. మన రక్తం.. ఒకరి ప్రాణం"సంగారెడ్డి :తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే - ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్, జిల్లా ముఖ్య నేతలు పాల్గొంటున్నారు.ఈ నెల సెప్టెంబర్ 22వ తేదీన సంగారెడ్డి స్థానిక ఐబీ (×దీ) ప్రాంగణంలో ఈ శిబిరం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానుంది. పుట్టినరోజు వేడుకలను కేవలం వ్యక్తిగత కార్యక్రమంగా కాకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా నిర్వహించాలనే సంకల్పంతో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. రక్తదానమే మహోన్నత సేవ --- నిర్వాహకుల పిలుపు:అత్యవసర వేళ ప్రాణరక్షణ: అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, రక్తదాన ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. యువత, జర్నలిస్టులు భాగస్వాములు కావాలి: సంపూర్ణ ఆరోగ్యవంతులైన యువత, పాత్రికేయ మిత్రులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక బాధ్యత: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావచ్చని వివరించారు. కార్యక్రమ వివరాలు:కార్యక్రమం: బండారు యాదగిరి జన్మదిన సేవా కార్యక్రమం --- రక్తదాన శిబిరం తేదీ: సెప్టెంబర్ 22 సమయం: ఉదయం 10:30 గంటల నుండి ప్రారంభం వేదిక: ప్రభుత్వ ఐబీ (×దీ), సంగారెడ్డి విజ్ఞప్తి: రక్తదానం చేయదలచిన వారు సకాలంలో హాజరై ప్రాణదాతలుగా నిలవాలని నిర్వాహక వర్గం కోరింది.

## రాయికోడ్ లో ఘనంగా విగ్నేశ్వరుడి నిమజ్జనం



, సంగారెడ్డి ప్రతినిధి సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లోనిమొదటి వార్డ్ లో భజరంగబలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన విగ్నేశ్వరుడిని గత ఏడు రోజులుగా తీరొక్క పూలతో,పత్రి ఆకు,గరక తో అర్చకుల వేదమంత్రోచ్చరణలతో పూజించి



ఆదివారం రాత్రి చిరుతాల రామాయణం మరియు వివిధ పాటలకు పిల్లలు, పెద్దలు,యువకుల నృత్యాల నడుమ పురవిధులగుండా శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేయడం జరిగింది.అంతకుముందు నిర్వహించిన ప్రసాదాల వేలం పాటలో పెద్దలడ్డును యూసుఫ్ పూర్ గ్రామస్తుడు వీర్ శెట్టి 20,000/-రూపాయలకు,చిన్నలడ్డును రాయికోడ్ ఫ్రెండ్స్ టీం సభ్యులు 13,000/- రూపాయలకు దక్కించుకున్నారు.

## ఆరూరు గ్రామ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యం.

### ------ ఆరూర్ గ్రామంలో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం.

### ------ గ్రామ సర్పంచ్ నాయకోటి లావణ్య మధు.



సంగారెడ్డి ప్రతినిధి ఆరూర్ గ్రామపంచాయతీ పరిధిలో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ శ్రీమతి నాయకోటి లావణ్య మధు భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో మురుగునీటి సమస్యకు శాశ్వత



పరిష్కారం కల్పించడంతో పాటు, పారిశు ద్ధ్యాన్ని మెరుగుపరచడం, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం లక్ష్యంగా ఈ పనులను చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు.ఇప్పటివరకు వర్షాకాలంలో మురుగునీరు నిలిచిపోవడం, ఇళ్ల పరిసరాల్లో దుర్వాసన వ్యాపించడం, దోమల బెడద పెరగడం వంటి సమస్యలను గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తే మురుగునీటిని సక్రమంగా తరలించడంతో పాటు, రహదారులు, వీధులు, నివాస ప్రాంతాల్లో పరిశుభ్రత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె అన్నారు.పనుల ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్, పంచాయతీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. భూగర్భ డ్రైనేజీ నిర్మాణంలో ఉపయోగించే పైపులు, పనుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారుల పునరుద్ధరణ, తాత్కాలిక మార్గాల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మ్యాదరి విట్టల్, భరత్ కుమార్, భాగ్యలక్ష్మి, అంజయ్య, మన్నె నాగేష్, పద్మ, భారతమ్మ, లక్ష్మి, రమేష్, నాగేష్, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ నాయికోటి మధు మణయ్య, మల్లికార్జున్, సంకి నర్సింలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.భూగర్భ డ్రైనేజీ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, పారదర్శకంగా చేపడతామని పంచాయతీ కార్యదర్శి మల్లేశం గౌడ్ తెలిపారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తయిన తర్వాత దాని నిర్వహణ, శుభ్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థతో గ్రామంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత మరింత మెరుగుపడి, ప్రజలకు సౌకర్యవంతమైన జీవన వాతావరణం ఏర్పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి,నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి

### చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి ప్రతినిధి సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ



సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిని జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నిర్మలా జగ్గారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా ఏడు సంవత్సరాలకు పైగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. ఆమె హయాంలో జిల్లా కేంద్రంలో ఏ విధంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించామో, అంతకంటే ఎక్కువగా చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. చంద్రశేఖర్ రెడ్డికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని జగ్గారెడ్డి సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు: చంద్రశేఖర్ రెడ్డినూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తనను డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.నిర్మలా జగ్గారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, ఆమె మాదిరిగానే అందరితో సమన్వయం చేసుకుంటూ పార్టీ కోసం పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.అధిష్టానానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే సంజీవరెడ్డినారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. తన తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డిపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చంద్రశేఖర్ రెడ్డి ఎంపికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

## ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి -- ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ.



,సంగారెడ్డి ప్రతినిధి ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి --అధికారులకు పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కరానికై సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ., వారితో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్య జాప్యానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమ సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి సమస్యలకు చట్టపరమైన పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఎస్పీ తెలిపారు.

## ఘనంగా అన్న ప్రసాద, సాంస్కృతిక కార్యక్రమాలు..



జనం,సంగారెడ్డి ప్రతినిధి సదాశివపేట మండలం ఏటిగడ్డ సంఘం గ్రామంలో శ్రీ స్వామి వివేకానంద యువజన సంఘం వారు నెలకొల్పిన వినాయకుడి వద్ద ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు జరపడం జరిగింది.. ఈ యొక్క కార్యక్రమం బర్దిపూర్ పీఠాధిపతులు.. శ్రీశ్రీశ్రీ 1008 మహంత్ డా: సిద్దేశ్వర ఆనందగిరి మహారాజ్ స్వామి గారి సమక్షంలో జరిగింది.. సిద్దేశ్వర స్వామి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ. తల్లిదండ్రులను గౌరవించాలని, యువత భక్తి మార్గంలో నడవాలని, కులమత భేదాలు లేకుండా అందరూ సన్మార్గంలో నడవాలని .. గణపతి విగ్రహాలు గ్రామంలో ఒకటి మాత్రమే ఉంచి ఐకృత చాటుకొని కోలాటాలతో భజనలతో నిమర్జనాలు నిర్వహించాలని సూచించడం జరిగింది. మరియు మండపం చాలా చక్కగా ఏర్పాటు చేశారని సంఘ సభ్యులను అభినందించడం జరిగింది... ఈ సందర్భంగా మన్సూర్ అహ్మద్ ఆధ్వర్యంలో జానపద కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది, విద్యార్థులకు పలు ఆట పోటీలు, చిన్నారులచే భరతనాట్యం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి .. మన్సూర్ ని ఈ సందర్భంగా అప్పగారు అభినందించడం జరిగింది.. ఈ సంవత్సరం గణపతి విగ్రహాన్ని అందించినందుకు శంభు ప్రసాద్ స్వామికి మరియు అన్నదాత జనార్దన్ కు అప్ప గారిచే సన్మానం చేయడం జరిగింది..కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంభు ప్రసాద్ స్వామి, మాజీ సర్పంచ్ అమరేందర్ రెడ్డి, యూత్ అధ్యక్షులు కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గురుగుల మల్లేశం ,వార్డు మెంబర్లు మౌనిక వీరన్న, గంగారం, సంఘం సభ్యులు బి కృష్ణ, బి జనార్ధన్, బి గోవర్ధన్,పి. సత్యనారాయణ , పి నరేష్, పి అనిల్,వి మహేందర్ , పి.శివశంకర్, వి శేఖర్, బి శ్రీధర్, మన్మోహన్ రావు, వీ తిరుపతి, వి చిరంజీవి, పి శివ కుమార్, ఎం .కృష్ణ .. గ్రామ పెద్దలు సంగయ్య స్వామి, వడ్ల సదాశివుడు,ఎడ్ల వీరన్న, చిన్న వీరన్న , శ్రీధర్,పరమేశ్వరయ్య స్వామి, ఎం రాజు , భీమ్రావు , చంద్రమౌళి స్వామి, జి విజయ ,మచ్చేందర్,లాడే నాగేష్, బక్కన్న, ఏ.మల్లేశం ,నరసింహులు, విట్టల్, బి రమేష్ ,అంజన్న, సంగన్న, శరవంద ,గ్రామ మహిళలు విద్యార్థులు యువకులు పాల్గొనడం జరిగింది

## వెల్లి విరిసిన మతసామరస్యం గణేష్ మండపం వద్ద అన్నదానం చేసిన ముస్లింలు



జనం రిపోర్టర్.. గాంధారి మండలంలోని గండిపేట్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద వినాయక చవితి పండుగ నుండి ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది ఆదివారం రాత్రి గ్రామ ముస్లిం యువకులు గణేష్ మండపం వద్ద వారే సరుకులన్నీ తెచ్చుకొని వంటలు చేసి గ్రామంలోని ప్రజలకు అన్నదానం సౌకర్యాన్ని కల్పించారు ఈ సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ ఎల్లవేళలా గ్రామస్తులకు అందుబాటులో ఉండి కుల మతాలన్నింటిని కలుపుకొని పోతూ సమాజంలో అందరినీ ఏకతాటిపై తెచ్చి ఇంకెన్నో సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుంటుందని ఫ్రెండ్స్ అధ్యక్షుడు సంఘం రాజు తెలిపారు ఫ్రెండ్స్ యూత్ తరఫున ముస్లిం సోదరులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు

## కామారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎక్సక్యూటివ్ మెంబెర్ గా లక్ష్మణ్ రాథోడ్

జనం రిపోర్టర్.. గాంధారికామారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతనంగా ఏర్పాటు అయింది, ఆదివారం తాడ్వాయి మండల కేంద్రంలోని కల్యాణమండపంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర పరిశీలకుల సమీక్షంలో జిల్లా కార్యవర్గంను ఏకగ్రీవంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, గాంధారి మండల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గా వ్యవహారిస్తున్న లక్ష్మణ్ రాథోడ్ ను జిల్లా ఎగ్జికూటివ్ మెంబెర్ గా ఎన్నుకున్నానట్లు అయన సూచించారు. మండల కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ గా సంగమేష్ వ్యవహారిస్తున్నారు

## పారిశ్రామిక విధానంపై విద్యార్థుల్లో అవగాహన ఉండాలి

### ఆయిల్ మిల్ వద్ద పాఠశాల అధ్యాపకులు విద్యార్థి బృందం




ఎమ్మిగనూరు,శివసూర్య,సెప్టెంబర్ 21:పారిశ్రామిక విధానంపై విద్యార్థుల్లో అవగాహన అవసరమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వివర్స్ కాలనీ) ప్రధానోపాధ్యాయులు బి నాగభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వీవర్స్ కాలనీ) వృత్తి విద్యా విద్యార్థులు కలగొట్ల గ్రామంలోని అమరావతి ఆయిల్ మిల్‌ను పారిశ్రామిక సందర్శనలో భాగంగా సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు నూనె తయారీ ప్రక్రియ, ముడి పదార్థాల వినియోగం, ప్యాకేజింగ్, నిల్వ, మార్కెటింగ్ , రిటైల్ కార్యకలాపాలను ప్రత్యక్షంగా పరిశీలించి అవగాహన పొందారు. అమరావతి ఆయిల్ మిల్ యజమాని చెరుకు రమేష్ విద్యార్థులకు పరిశ్రమలోని తయారీ, ప్యాకేజింగ్ , మార్కెటింగ్ ప్రక్రియలను వివరించారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులకు పరిశ్రమల పనితీరు, రిటైల్ రంగం మరియు ఉద్యోగ నైపుణ్యాలపై ప్రత్యక్ష అవగాహన లభించింది.కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఎం. ఈరన్న, ఎం. సునీత, ఎం. సుధాకర్, కె. కిరణ్ కుమార్ , ఆర్ట్ ఉపాధ్యాయులు వి. నాగరాజరావు, అలాగే వృత్తి విద్యా శిక్షకులు సి.వి. శ్రీహరి (రిటైల్), కట్టుబడి వంశీ (ఆటోమోటివ్) పాల్గొన్నారు.

## నందవరం లో ఉన్న రెయిన్బో పాఠశాలను సీజ్ చేయాలి

### నందవరం తహసీల్దార్ గారికి వినతి పత్రాన్ని అందజేసిన విద్యార్థి సంఘ నాయకులు



నందవరం,శివసూర్య, సెప్టెంబర్ 21: నందవరం మండలం లో ఉన్న రెయిన్బో ఇంగ్లీష్ మీడియంపాఠశాల ను సిజ్ చేయాలి అని డి ఎస్ వై ఏ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ , ఆర్ వి ఎఫ్ జిల్లా అధ్యక్షులు పోతులపాడు నాగరాజు లు మండల తహసీల్దార్ అబ్దుల్ వహాబ్ గారికి వినతిపత్రం ని అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందవరం మండలంలో ఉన్నటువంటి రైన్బో పాఠశాలకు ప్రభుత్వం నుంచి సరైన అనుమతులు లేవని, ముఖ్యంగా పాఠశాల మీద నుండి విద్యుత్ తీగల వెళ్లడం జరిగింది పాఠశాల రేకుల షెడ్లు లో నడపడం వలనా ఆ రేకుల షెడ్లకు విద్యుత్ తీగల కేవలం రెండు అడుగు దూరం మాత్రం ఉందని వర్షాలు గాని ఈదురు గాలులు వస్తే ఆ విద్యుత్ తీగలు రేకుల షెడ్లు తాకే అవకాశం ఉందని దాని వల్ల పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో విద్యార్థులను ఇరుకు గదులలో రేకులు షెడ్లు కింద కూర్చోబెట్టడం జరుగుతుంది అని అదేవిదంగా పాఠశాలలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రులు నుండి వేలకు వేలు ఫీజులు వసూలు చేయడం జరుగుతుంది అదేవిధంగా అర్హత లేని ఉపాధ్యాయులతో విద్య బోధన చేస్తున్నారు స్కూల్ పై చర్యలు తీసుకోవాలి ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు

# అత్యంత విషపూరితమైన గడ్డిమందు పారాక్వాట్..! ప్లీజ్ క్విట్



అత్యంత విషపూరితమైన (హై అక్యూట్ టాక్సిసిటీ) గడ్డి/కలుపు మందు పారాక్వాట్‌ను నిషేధించాలన్న డిమాండ్ ఊపందుకుంది. దీన్ని 9 పంటల్లో గడ్డి/కలుపు నివారణకు వినియోగించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే, 25 పంటల్లో దీన్ని తెలిసో తెలియకో వాడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ మందును చల్లేటప్పుడు జాగ్రత్తలు తగిన రీతిలో తీసుకోకపోవటం వల్ల రైతులు, రైతుకూలీలు ఆ విషప్రభావానికి తీవ్రఅస్వస్థతకు గురై చనిపోతున్నారు. ఈ ప్రమాదకరమైన రసాయనం గాలి ద్వారా పీల్చినా, క్షణికావేశంలో తాగినా, దీన్ని చల్లిన నేలపై నడిచేటప్పుడు ముల్లు గుచ్చుకున్నా శరీరం విషపూరితమవుతుంది. ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, గుండె దెబ్బతింటాయి. దీని ప్రభావాన్ని అడ్డుకోవటానికి ఇప్పటి వరకు విరుగుడు చికిత్స అందుబాటులో లేదు. ఈ కారణంగా పారాక్వాట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిషేధించాలన్న డిమాండ్ నానాటికీ బలపడుతోంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, డాక్టర్స్ ఎగెనెస్ట్ పారాక్వాట్ పాయిజన్ సంస్థలు సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్‌లో పలువురు పాల్గొని నిషేధం కోసం పోరాడతామన్నారు. ఇప్పటికే ఒడిషా, కేరళ రాష్ట్రాల్లో నిషేధించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ నిషేధించాల్సిన అవసరం ఉంది. పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ ఇండియా కొన్ని సంవత్సరాల క్రితమే రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి నిషేధించాలని కోరింది. ఈ నేపథ్యంలో అసలు పారాక్వాట్ కలుపు/గడ్డి మందు పూర్వాపరాలేమిటో తరచి చూద్దాం... పారాక్వాట్ డైక్లోరైడ్.. నాన్--సెలెక్టివ్ కాంటాక్ట్ హెర్బిసైడ్. అంటే.. ఏదో ఒక రకం కలుపు మొక్కనో లేదా ఏవో కొన్ని రకాల కలుపు మొక్కల్నో నిర్మూలించడానికి ఉద్దేశించింది కాదు. ఇది తాకిన అన్ని ఆకుపచ్చ మొక్కల కణజాలాలను చంపుతుంది లేదా దెబ్బతీస్తుంది. వేగంగా పనిచేసే రసాయనం. ఇలాంటి కలుపు మందులు పారిశ్రామిక ప్రాంతాల్లో, రోడ్ల పక్కన చెట్లు, గడ్డిని నియంత్రచడానికి.. తేయాకు, పత్తి, బంగాళాదుంపలు తదితర పంటల్లో కలుపు మొక్కలను తొలగించడానికి పయోగిస్తారు. ఇటువంటి గడ్డి మందులు మొక్కల కణ త్వచాలను నాశనం చేయడం ద్వారా, కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం కలిగించడం ద్వారా ఆ మొక్కలు ఎండిపోయేలా చేస్తాయి. దీనివల్ల గంటల్లోనే మొక్కల భాగాలు వేగంగా, స్పష్టంగా ఎండిపోతాయి, వాడిపోతాయి. పారాక్వాట్‌ను గడ్డి, పెద్ద ఆకులతో కూడిన కలుపు మొక్కలను వేగంగా నాశనం చేయడానికి విస్తృతంగా ఉపయోగిస్తారు.

### 1964 నుంచి వాణిజ్యపరంగా ఉత్పత్తి

పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుకు 140 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగంలో ఉన్న, వివాదాస్పదమైన కలుపు మందులలో ఒకటి. 19వ శతాబ్దం చివరలో మొదటిసారిగా సంశ్లేషణ చేయబడినప్పటికీ, కలుపును చంపే దీని సామర్థ్యాన్ని 20వ శతాబ్దం మధ్యలో మాత్రమే గుర్తించారు. ఆస్ట్రియన్ రసాయన శాస్త్రవేత్తలు హ్యూగో వీడెల్, ఎం. రస్సోలు 1882లో మొదట అయోడైడ్ ఉప్పుగా సంశ్లేషణ చేశారు. 1955లో ఇంగ్లాండ్‌లోని ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ (ఐఇఐ) శాస్త్రవేత్తలు వ్యవసాయ రసాయనంగా దాని సామర్థ్యాన్ని గుర్తించారు. 1962 నుంచి వాణిజ్య పరంగా ఉత్పత్తి చెయ్యటం ?ర?రంభమైంది. 1964 మొదట అమెరికాలో పురుగుమందుగా ఉపయోగించడానికి నమోదైంది. 1970 దశకం చివరలో మెక్సికన్ గంజాయి పొలాలపై పారాక్వాట్‌ను అమెరికా స్ప్రే చేయించింది. 1985లోజూన్‌లో వెండింగ్ మెషిన్ ద్వారా విక్రయించిన పానీయాలలో ఈ రసాయనం కలవటం ఫలితంగా కనీసం 10 మంది మరణించారు.

### 2007లో నిషేధించిన ఈయూ

అమెరికా 1978లో పారాక్వాట్‌ను అధిక విషపూరిత స్వభావం కారణంగా గుర్తించి, పరిమితంగా వాడే పురుగుమందుగా వర్గీకరించింది. 1980--90 దశకాల్లో అనేక దేశాలు దీన్ని నియంత్రించటం ప్రారంభించాయి. పారాక్వాట్ వల్ల ప్రజారోగ్యానికి తీరని హాని జరుగుతోందని స్వీడన్, తదితర ఐరోపా దేశాలు పట్టుబట్టటంతో 2007లో యూరోపియన్ యూనియన్ నిషేధించింది. ప్రస్తుతం చైనా (దేశీయ వినియోగం మాత్రమే), బ్రెజిల్, థాయిలాండ్‌తో సహా 70కి పైగా దేశాల్లో పారాక్వాట్ గడ్డి మందు వాడకాన్ని నిషేధించాయి లేదా దశలవారీగా వాడకాన్ని నిలిపివెయ్యటానికి నిర్ణయాలు తీసుకున్నాయి. అయినప్పటికీ అమెరికాతో పాటు భారత్ సహా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇప్పటికీ విస్తృతంగా ఉపయోగిస్తూనే ఉన్నారు.

### అమెరికాలో త్వరలో ఉత్పత్తి నిలిపివేత

పారాక్వాట్ గడ్డి మందు ప్రభావానికి గురైన వారికి పార్కిన్సన్స్ వ్యాధి వస్తోందని నమ్ముతున్నారు. దీని తయారీదారులపై ప్రస్తుతం అమెరికాలో వేలాది వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్ నాటికి పారాక్వాట్ గడ్డి మందు తయారీని నిలిపివేస్తానని సింజెంట బహుళ జాతి కంపెనీ ప్రకటించినట్లు ద గార్డియన్‌లో తాజాగా కథనం ప్రచురితమైంది. ఈ నిర్ణయం ప్రజారోగ్యంలో ఒక మైలురాయి వంటిదని ఫ్లోరిడా యూనివర్సిటీలోని ఫిక్సెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ మైఖేల్ ఓకున్ వ్యాఖ్యానించారు. యూరప్ దేశాలు సహా అనేక దేశాలు నిషేధించినప్పటికీ అమెరికాలో సోయాబీన్స్, పత్తి, మొక్కజొన్న, ద్రాక్ష, పిస్తా, వేరుశనగ వంటి ఎన్నో పంటల్లో ఇప్పటికీ దీన్ని వాడుతూనే ఉన్నారు.

### భారత్‌లో పరిస్థితులు



భారతదేశంలో పారాక్వాట్ డైక్లోరైడ్ వాడకాన్ని నిషేధించాలన్న డిమాండ్ ప్రబలంగా ఉంది. దీన్ని ఉపయోగించడానికి జాతీయ స్థాయిలో అనుమతి ఉంది. అయినప్పటికీ.. దీని అత్యధిక విషపూరిత స్వభావం, దీన్ని తాగటం ద్వారా ఆత్మహత్య చేసుకునే వారి సంఖ్య పెరుగుతుండటంతో ఒడిషా, కేరళ వంటి రాష్ట్రాలు నిషేధించాయి. ఒడిశా రాష్ట్రంలో ?రాక్వాట్ అమ్మకం, పంపిణీ, వాడకంపై నిషేధం కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం 2023 చివరిలో నిషేధించింది. ప్రతి ఆరు నెలలకోసారి నిషేధాన్ని పొడిగిస్తోంది. కేరళ గతంలో నిషేధాన్ని అమలు చేసింది. కానీ, పురుగుమందుల తయారీదారులు చట్టబద్ధంగా సవాలు చేసిన తర్వాత 2022లో దాన్ని రద్దు చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. పారాక్వాట్ విష ప్రభావంతో వందలాది మంది మరణిస్తున్నందున దీన్ని నిషేధించాలని పిటిషనర్లు కోరుతున్నారు. కలుపు మందుపై మీ వైఖరేమిటో వివరించమని హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

### 9 పంటలకే అనుమతి

పారాక్వాట్ కలుపు మందును టీ, కాఫీ, పత్తితో సహా తొమ్మిది నిర్దిష్ట పంటలపై మాత్రమే ఉపయోగించడానికి కేంద్ర క్రిమిసంహారకాల బోర్డు రిజిస్ట్రేషన్ కమిటీ అనుమతించింది. అయితే, దేశంలో 25 రకాల పంటలపై ఉపయోగించబడుతున్నట్లు పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ ఇండియా సర్వే నివేదికలు సూచిస్తున్నాయి. ఇలా వాడటం భారతీయ క్రిమిసంహారకాల చట్టాన్ని ఉల్లంఘించటమే. భారత దేశంలో 1,500 కంటే ఎక్కువ తయారీ యూనిట్లు పారాక్వాట్‌ను ఉత్పత్తి చేయడానికి లైసెన్స్ పొందగా, వీటిలో 35 ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నియమించిన అనుపమ్ వర్మ కమిటీ 2015లో పారాక్వాట్‌ను సమీక్షించి, 'కఠినమైన పరిమితులు', మెరుగైన ప్యాకేజింగ్ పద్ధతులు పాటిస్తూ వినియోగాన్ని కొనసాగించడానికి అనుమతించింది. అయితే ఈ చర్యలు సమర్థంగా అమలు కావటం లేదని నిపుణులు వాదిస్తున్నారు.

### సైనైడ్ కన్నా ప్రమాదకరం

వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు పారాక్వాట్‌ను 'సైనైడ్ కంటే ప్రమాదకరమైనది' అని అభివర్ణిస్తున్నారు. ఎందుకంటే దీనికి విరుగుడు లేదు. అందువల్ల పొలాల్లో దీన్ని పిచికారీ చేసే క్రమంలో దాని విషప్రభావానికి గురైన వారు లేదా దీన్ని క్షణికావేశంలో తీసుకున్న వారికి చికిత్స చేసి రక్షించటం కష్టసాధ్యమైంది. దీంతో మరణాలు రేటు పెరుగుతోంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వంటి వైద్య సంఘాలు దీన్ని వెంటనే పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నాయి.

### దేశవ్యాప్తంగా నిషేధించాలి

పారాక్వాట్ వంటి అత్యంత విషతుల్యమైన వ్యవసాయ రసాయనాల వాడాకాన్ని వదిలించుకోవడానికి, వాటి వల్ల కలిగే హానిని నిలువరించటానికి పనిచేస్తున్నాం. క్లోర్‌పైరిఫోస్, పురుగుమందులు, అలాగే అట్రాజిన్, పారాక్వాట్ డైక్లోరైడ్ కలుపు మందులపై అధ్యయనం చేశాం. పారాక్వాట్‌ను 9 పంటల్లో వాడటానికి ప్రభుత్వ అనుమతి ఉంటే 25 పంటల్లో వాడుతున్నట్లు మా అధ్యయనంలో తేలింది. దీన్ని వాడే క్రమంలో చాలా మంది దీని విషప్రభావానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారు. దీన్ని క్షణికావేశంలో తాగి ఆత్మహత్యల పాలవుతున్న రైతులు, రైతు కూలీల సంఖ్య కూడా చాలా ఎక్కువగా ఉంది. ప్రాథమికంగా ప్రాణాలను చంపడానికి రూపొందించబడిన పురుగుమందుల దీర్ఘకాలిక పరిణామాలను రైతులు, వినియోగదారులు అర్థం చేసుకోవాలి. పురుగుమందుల హానికరమైన ప్రభావాలపై శాస్త్రవేత్తలు మరింత పరిశోధన చేయాలి. విధాన నిర్ణేతలు కూడా తమ అవగాహనను పెంచుకోవాలి. రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ఈ విష రసాయనాలను నియంత్రించడంపై దృష్టి పెట్టాలి. వాతావరణ మార్పుకు ప్రధాన కారకాల్లో విధ్వంసక పురుగుమందులు కూడా ఉన్నాయి. అత్యంత విషతుల్యమైన పారాక్వాట్ గడ్డి మందును దేశవ్యాప్తంగా నిషేధించాలి.

# ఫిట్స్‌కి సర్జరీ అవసరమా?

## పిల్లల పెంపకం

మా బాబుకి రెండో సంవత్సరంలో ఫిట్స్ మొదలయ్యాయి. అప్పటి నుంచి తరచుగా వస్తున్నాయి. నాలుగేళ్లు రకరకాల మందులు వాడాము. మొదట్లో మందులకు ఈ ఫిట్స్ కంట్రోల్ అయ్యాయి. కొంతకాలానికి మళ్లీ తీవ్రం అయ్యాయి. మళ్లీ డాక్టర్‌కి చూపించాం. మందులు స్టార్ట్ చేశాం. ఆరు నెలల పాటు ఫిట్స్ రావడం ఆగిపోయింది. నాలుగు నెలల నుంచి మళ్లీ వస్తున్నాయి. ఈఈజీ, ఎంఆర్ఐ చేయించాం. మందులు ఇచ్చారు. ఈ మందులు వాడిన తర్వాత అపెలెప్సీ సర్జరీ చేయాల్సిన అవసరం ఉంటుందని చెప్పారు. మరికొన్ని టెస్టులు కూడా చేయాల్సి ఉంటుందన్నారు. వాటిని బట్టి సర్జరీ ఎలా చేయాలనేది నిర్ణయమవుతుందని డాక్టర్ చెప్పారు. ఒక వయసు తర్వాత ఈ మూర్ఛ వ్యాధి పోతుందని కుటుంబ సభ్యులు చెప్పారు. దీని కోసం సర్జరీ అవసరమా? ప్రత్యామ్నాయం లేదా?



ఫిట్స్ (మూర్ఛ వ్యాధి) అరుదుగా వస్తుంది. జ్వరం ఎక్కువగా వచ్చినప్పుడు పిల్లలకు ఫిట్స్ వస్తాయి. ఇవి మూడు నుంచి అయిదు సంవత్సరాల వయసులో వాటంతటవే తగ్గిపోతాయి. కానీ, కొందరిలో పుట్టినప్పటి నుంచి తరచుగా ఫిట్స్ రావడం చూస్తుంటాం. వీటిని అపెలెప్సీ అంటారు. ఈఈజీ, ఎంఆర్ఐ పరీక్షలు సాధారణంగా చేస్తారు. జన్యు లోపాలు, ఇన్ఫెక్షన్లు, మెదడు నిర్మాణంలో లోపాలు, మెదడులో ట్యూమర్లు పెరగడం, మెదడులో రక్తస్రావం కావడం వల్ల ఫిట్స్ వస్తాయి. కొంతమంది పిల్లల్లో ఈ మూర్ఛ వ్యాధి మందులకు తగ్గిపోతుంది. డాక్టర్లు ఈఈజీ పరీక్ష చేసిన తర్వాత ఎప్పుడు మందులు ఆపాలో చెబుతారు. కానీ 20 నుంచి 30 శాతం మంది పిల్లల్లో మందులు వాడినా ఫిట్స్ కంట్రోల్ కావు. దీనిని 'డ్రగ్ రిఫ్రాక్టరీ ఎపెలెప్సీ' అంటారు. ఇలాంటి పిల్లలను లాంగ్ టర్మ్ మానిటరింగ్ చేయాల్సి రావొచ్చు. రెండు, మూడు రోజులపాటు నిరంతరం ఈఈజీ తీస్తాం. దీని ద్వారా ఫిట్స్ ఎప్పుడు, ఏ భాగంలో మొదలవుతున్నాయి? ఎలాంటి ఫిట్స్ వస్తున్నయో గుర్తిస్తాం. దాని తర్వాత ఎంఆర్ఐ, అవసరమైన ఇతర పరీక్షలు కూడా చేయిస్తాం.ఈ అన్ని పరీక్షల ఆధారంగా ఫిట్స్ మెదడులో ఏ భాగం నుంచి వస్తున్నాయో నిర్ధారణ అవుతుంది. అలాగే మెదడులో ఫిట్స్ మొదలయ్యే భాగంలో ఉన్న సమస్య కూడా అర్థమవుతుంది. ఆ తర్వాత.. మెదడు నిర్మాణంలో లోపాలు ఉంటే సరిచేస్తారు. మెదడులో సమస్యకు కారణమైన భాగాన్ని తొలగిస్తారు. అప్పుడు ఫిట్స్‌ని తగ్గించవచ్చు. ఎక్కడ సమస్య ఉందో తెలిసినప్పుడు మెదడుకు శస్త్ర చికిత్స చేస్తాం. కానీ కొందరిలో ఎక్కడ సమస్య ఉందో కచ్చితంగా తేలదు. అప్పుడు రకరకాల న్యూరో మాడ్యులేషన్ చికిత్సలు చేయాల్సిన అవసరం పడుతుంది. వగల్ నెర్వ్ మాడ్యులేషన్, డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ వంటి చికిత్సలతో ఫిట్స్‌ని నివారించడానికి, ఉపశమనం కలిగించడానికి అవకాశం ఉంది. మీ బాబుకు ఉన్న సమస్యకు కారణం ఆధారంగా చికిత్స చేస్తారు. లక్షణాల ఆధారంగా చికిత్స చేయరు. అధిక జ్వరం వచ్చినప్పుడు పిల్లల్లో ఫిట్స్ కామన్‌గానే వస్తాయి. అన్నీ ఒకే రకమైనవి కావు. వాటి కారణాలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి కొందరికి వెంటనే తగ్గదు. చికిత్స దీర్ఘకాలం చేయాల్సి రావొచ్చు. కొందరికి ఆపరేషన్ అవసరం పడొచ్చు. మీ బాబుకి డాక్టర్లు చెప్పిన పరీక్షలన్నీ చేయించండి. ఏది అవసరమో డాక్టర్లు చెబితే అదే చికిత్స చేయించండి. బంధువులు, ఇతరులు చెప్పినట్టు వాళ్లకు తెలిసిన పిల్లలకు జరిగిన చికిత్స మీ బాబుకి సరిపోకపోవచ్చు.

# రోజూ గుప్పెడు పిస్తా పప్పును స్నాక్స్‌గా తింటే ఎన్నో ఉపయోగాలు



చాలా మంది ఇష్టంగా తినే ఆరోగ్యకరమైన గింజల్లో పిస్తా పప్పు ఒకటి. వీటిలో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి ముఖ్యమైన పోషకాలు అనేకం ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో, ఎక్కువ సమయం ఆకలి కాకుండా చేయడంలో పిస్తా పప్పు ఎంతో సహాయపడుతుంది. రాత్రి సమయంలో స్నాక్స్ గా తినడానికి పిస్తా పప్పు చాలా చక్కగా ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పిస్తా పప్పు తృప్తి కలిగించే ఆహారమని వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని అయితే వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది కనుక వీటిని మితంగా తీసుకోవాలని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే పిస్తా పప్పును తీసుకోవడం వల్ల కలిగే కొన్ని ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### గుండె ఆరోగ్యానికి..

పిస్తా మొక్క ఆధారిత ప్రోటీన్ కు మంచి మూలం. సుమారు 28 గ్రాముల పిస్తా పప్పులో 6 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. శాకాహారులకు పిస్తా ప్రోటీన్ కు మంచి మూలమని చెప్పవచ్చు. అలాగే వీటిలో శరీరానికి అవసరమయ్యే తొమ్మిది రకాల ఆమైనో ఆమ్లాలు కూడా ఉంటాయి. వీటిలో మెగ్నీషియం కూడా మంచి పరిమాణంలో ఉంటుంది. గుండె స్పందనను నియంత్రించడంలో, కండరాలకు విశ్రాంతి ఇవ్వడంలో, నరాల పనితీరును మెరుగుపరచడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. అలాగే నిద్రించే ముందు వీటిని తీసుకోవడం వల్ల వీటిలో ఉండే మెగ్నీషియం కారణంగా మంచి నిద్రను సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా పిస్తాను తీసుకోవడం వల్ల కండరాల నొప్పులు కూడా తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. పిస్తాలను స్కిన్నీ నట్స్ అని కూడా పిలుస్తారు. ఎందుకనగా ఇతర గింజలతో పోలిస్తే వీటిలో తక్కువ క్యాలరీలు ఉంటాయి. వాల్‌నట్స్, మకాడామియా వంటి నట్స్ తో పోలిస్తే అదే క్యాలరీలతో వీటిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవచ్చు.



### బరువు తగ్గేందుకు..

పిస్తాలో ఉండే ఫైబర్ వల్ల ఎక్కువ సమయం ఆకలి అవ్వకుండా ఉంటుంది. దీంతో బరువు కూడా తగ్గవచ్చు. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో కూడా ఇవి సహాయపడతాయి. పిస్తాలో ల్యూటిన్, జియాక్సాంతిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వయసు పెరగడం వల్ల వచ్చే కంటి సమస్యల నుండి రక్షించడంలో దోహదపడతాయి. పిస్తాను తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ ఉత్పత్తి పెరిగి రక్తహీనత తగ్గుతుంది. వీటిలో జింక్, విటమిన్ ఇ వంటి పోషకాలు ఉంటాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇవి సహాయపడతాయి. చర్మ సంరక్షణలో కూడా పిస్తా దోహదపడుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి.

### ఎంత మోతాదులో తినాలంటే..

ఇలా అనేక రకాలుగా పిస్తా పప్పు ఆరోగ్యానికి మేలు చేస్తుందని, రాత్రి సమయంలో స్నాక్స్ గా తినడానికి ఇవి ఎంతో చక్కగా ఉంటాయని నిపుణులు తెలియజేస్తున్నారు. అయితే వీటిని రోజుకు 10 నుండి 12 పప్పుల మోతాదులో మాత్రమే తీసుకోవాలి. వీటిని అతిగా తీసుకోవడం వల్ల బరువు పెరగడం, అజీర్ణం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఉప్పు లేని పిస్తా పప్పులను తీసుకోవడం మంచిది. ఉప్పు ఉన్న పిస్తా పప్పు రక్తపోటు ఉన్న వారికి అంత మంచిది కాదు. అలాగే వీటిలో ఆక్సలైట్స్ ఉంటాయి కనుక మూత్రపిండాల్లో రాళ్లు ఉన్న వారు వీటిని మితంగా తీసుకోవడం మంచిది. పిస్తా పప్పును రోజు వారి ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని అనేక పోషకాలు అందుతాయని వీటిని క్రమం తప్పకుండా తీసుకునే ప్రయత్నం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# కాస్త చల్లబడండి



శీతాకాలం ముగిసింది. ఎండాకాలం మొదలైంది. వాతావరణం మారినప్పుడు శరీర అంతర్గత వ్యవస్థలు బాహ్య వాతావరణానికి అనుగుణంగా మారడానికి ప్రయత్నిస్తాయి. శీతాకాలం నుంచి వేసవికి మారినప్పుడు కొందరికి ఇమ్యూనిటీ పవర్ తగ్గడంతో రోగాల బారిన పడతారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం వస్తాయి. ఈ సమస్యల నుంచి శరీరాన్ని కాపాడుకునేందుకు మారుతున్న సీజన్‌కి తగ్గట్టు రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ఆహారం, హైడ్రేషన్‌పై దృష్టి పెట్టాలి. వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బ, డీహైడ్రేషన్ బారినపడతారు. వాతావరణ ఉష్ణోగ్రతలు వేగంగా పెరిగినప్పుడు శరీర రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. అందుకే వేసవిలో ఫుడ్ పాయిజనింగ్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. కాబట్టి ఈ కాలంలో రోగనిరోధక శక్తి పెంచుకోవడానికి కొన్ని చిటాలు పాటిస్తే సరిపోతుంది. ఉసిరి, నిమ్మ, నారింజ వంటి సిట్రస్ జాతి పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. అలాగే జామపండ్లు ఎక్కువగా తినాలి. వైరస్ నుంచి బయటపడేందుకు జింక్ ఉన్న బాదం పప్పు, జీడిపప్పు, గుమ్మడి గింజలు, వాల్ నట్స్ తీసుకోవాలి. ఇక శరీర బలం కోసం పప్పులు, గుడ్లు, పనీర్ వంటి ప్రొటీన్లు అధికంగా ఉండేవాటిని ఆశ్రయించాలి. పెరుగు లేదా పులియబెట్టిన ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి పొట్ట ఆరోగ్యంగా ఉంటుంది. వేసవికాలంలో చెమట ఎకువగా పడుతుంది. ఇది డీహైడ్రేషన్, తకువ రక్తపోటు, అలసట, తలనొప్పి, వడదెబ్బకు దారితీస్తుంది. ఈ సమస్యలు రాకుండా నీరు తాగడం చాలా ముఖ్యం. రోజులో కనీసం 3-4 లీటర్ల నీరు తాగాలి. కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మామిడి పన్నా, మజ్జిగ వంటి సహజ పానీయాలు తాగితే మంచి ఫలితాలు ఉంటాయి. ఖాళీ కడుపుతో చల్లని నీరు తాగితే గొంతు నొప్పి రావొచ్చు. కాబట్టి, గోరువెచ్చని నీరు తాగడం మంచిది. మీతో పాటే ఒక వాటర్ బాటిల్ ఉంచుకోండి.

## పెరియార్‌పై అన్నామలై కీలక వ్యాఖ్యలు



చెన్నై: ద్రవిడ ఉద్యమ నేత, ద్రవిడ కజగం (డీకే) వ్యవస్థాపకుడు ఈవీ రామసామి నాయక్కర్ (పెరియార్)పై తన వైఖరిని మాజీ తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె. అన్నామలై స్పష్టం చేశారు. మహిళా విముక్తి, కుల నిర్మూలన కోసం పెరియార్ చేసిన కృషిని తాను అంగీకరిస్తున్నానని, అయితే ఆయన నాస్తిక భావజాలాన్ని, బ్రాహ్మణ వ్యతిరేక వైఖరిని మాత్రం పూర్తిగా ఖండిస్తున్నానని తెలిపారు. సెప్టెంబర్ 17న పెరియార్ జయంతి సందర్భంగా అన్నామలై చేసిన నివాళిపై కొందరు మద్దతుదారుల నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఈ వివరణ ప్రాధాన్యత సంతరించుకుంది. సెప్టెంబర్ 20న మదురైలో జరిగిన కార్యక్రమంలో 'వీ ద లీడర్స్' కార్యకర్తలను ఉద్దేశించి అన్నామలై మాట్లాడారు. మహిళా సాధికారత, కుల వివక్ష నిర్మూలన అంశాల్లో పెరియార్ చేసిన కృషిని అంగీకరిస్తున్నామని చెప్పారు. అయితే పెరియార్ నాస్తిక భావాలను, బ్రాహ్మణ వ్యతిరేక వైఖరిని మాత్రం పూర్తిగా తిరస్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. పెరియార్ 147వ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 17న అన్నామలై సోషల్ మీడియా వేదికగా నివాళి అర్పించారు. సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో పెరియార్ కీలక పాత్ర పోషించారని, తమిళనాడు సామాజిక, రాజకీయ చరిత్రపై చెరగని ప్రభావం చూపారని ఆయన పేర్కొన్నారు. అసమానతలు, మూఢనమ్మకాలపై పెరియార్ తన జీవితంలో ఎక్కువ భాగం పోరాడారని కూడా అన్నారు. అన్నామలై నివాళిపై ఆయన మద్దతుదారుల్లో కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందూ మతపరమైన అంశాలతో అనుబంధం ఉన్న నాయకుడిగా కనిపించే అన్నామలై, నాస్తిక, హేతువాద భావజాలంతో గుర్తింపు పొందిన పెరియార్‌ను ఎందుకు ప్రశంసించారని ప్రశ్నించారు. పెరియార్ విగ్రహాలు, ఆలయాల సమీపంలో నాస్తిక సందేశాల అంశంపై అన్నామలై గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా కొందరు గుర్తుచేశారు. పెరియార్ రాజకీయ చరిత్రలో అనేక వైరుధ్యాలు ఉన్నాయని అన్నామలై పేర్కొన్నారు. హిందీ వ్యతిరేక ఉద్యమానికి సంబంధించి 1935, 1965లో పెరియార్ చేసిన వ్యాఖ్యలను ఉదాహరణగా ప్రస్తావించారు. అలాగే కాంగ్రెస్, డీఎంకేతో పెరియార్‌కు ఉన్న రాజకీయ సంబంధాలను కూడా ఆయన ప్రస్తావించారు. 1961లో అప్పటి మద్రాస్ ముఖ్యమంత్రి కె. కామరాజ్‌కు ఓటు వేయాలని పెరియార్ పిలుపునిచ్చారని తెలిపారు. హిందూ ఆలయాల వెలుపల నాస్తిక సందేశాలతో ఉన్న విగ్రహాల విషయంలోనూ అన్నామలై తన వైఖరిని పునరుద్ఘాటించారు. 'వీ ద లీడర్స్' అధికారంలోకి వస్తే అలాంటి విగ్రహాలను ఇతర బహిరంగ ప్రదేశాలకు తరలిస్తామని చెప్పారు. అయితే వాటిని ధ్వంసం చేయబోమని, గౌరవప్రదంగా మరోచోటికి తరలిస్తామని స్పష్టం చేశారు. ఆలయంలోకి వెళ్లే భక్తులకు నేరుగా నాస్తిక సందేశాలు ఎదురుకాకూడదన్నది తన అభిప్రాయమని తెలిపారు. బీజేపీ నుంచి వైదొలిగిన అనంతరం అన్నామలై 'వీ ద లీడర్స్' అనే కొత్త రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పెరియార్‌పై ఆయన చేసిన తాజా వ్యాఖ్యలు తన రాజకీయ, భావజాల వైఖరిని స్పష్టం చేసే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. పెరియార్ సామాజిక సంస్కరణలలోని మహిళా హక్కులు, కుల నిర్మూలన అంశాలను అంగీకరిస్తూనే.. ఆయన నాస్తిక, బ్రాహ్మణ వ్యతిరేక భావజాలాన్ని మాత్రం అంగీకరించబోనని అన్నామలై తేల్చి చెప్పారు.

## దూసుకొస్తున్న అల్పపీడనం.. ఏపీకి భారీ వర్ష సూచన!



విశాఖ : ఏపీలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు కనబడుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతున్న కారణంగా ఏపీలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కాస్త బలపడి రాగల 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని, ఈ ప్రభావంతో ఏపీలో ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. బలపడుతున్న అల్పపీడనం.. 23వ తేదీ నాటికి ఉత్తర కోస్తాతో పాటు దక్షిణ ఒడిస్సా తీరానికి దగ్గరవుతుందని, దాంతో కొన్ని జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఈ ఐదు రోజుల పాటు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. తీరం వెంబడి ఈదురు గాలులు కొనసాగుతాయని, గరిష్టంగా 70 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. దీని ప్రభావంతో రేపటి నుంచి(మంగళవారం, సెప్టెంబర్ 23వ తేదీ) నుంచి కోస్తా జిల్లాలకు హై అలర్ట్ ప్రకటించారు. ఈ నెల 23, 24వ తేదీల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ప్రధానంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, వైఎస్సార్ కడప, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి, చిత్తూరు జిల్లాలకు ఈరోజు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. రేపు శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు.

## ఏపీలో ప్రజాస్వామ్యం ఉందా?: సజ్జల



తాడేపల్లి : డీఎస్సీలో అక్రమాలు చేసి, ఆ తప్పుల నుంచి బయటపడేందుకే వెన్నుపోట్ల పార్టీ దాడుల్ని కొనసాగిస్తోందని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వ ఆటలు సాగవని. న్యాయ స్థానాల ద్వారా పోరాడుతామని ఆయన హెచ్చరించారు. అసలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నించారాయన. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడిన సజ్జల.. డీఎస్సీ అక్రమాలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కూటమి శ్రేణులు దాడులకు తెగబడుతున్న ఘటనలను ఆయన తీవ్రంగా ఖండించారు. 'దబాయించడం, బుకాయించడమే కాదు... ఎదురుదాడికి దిగుతున్నారు. శాంతియుతంగా ధర్నాలు చేస్తున్న వారిపై దాడులకు తెగబడుతున్నారు. నియంతల పాలన సమయంలో కూడా ఇలా జరగలేదు. అబద్ధం, దుర్మార్గం, బరితెగింపు, క్రూరత్వం కలిపితే అది వెన్నుపోట్ల పార్టీ. చంద్రబాబుకు కొడుకు తోడయ్యాక ఈ పరిస్థితులు మరింత దిగజారాయి. డీఎస్సీ అభ్యర్థి కోర్టుకు వెళితే అసలు బండారం బయటపడింది. డీఎస్సీలో మోసపోయిన అభ్యర్థులకు న్యాయం చేయకపోతే ఎలా? డీఎస్సీలో ఎన్ని కుంభకోణాలు జరిగాయో అన్నీ ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. టెట్ పాస్ కానీ వారికి ఉద్యోగాలు ఇచ్చారు. సంబంధం లేని సబ్జెక్టులలోనూ ఉద్యోగాలు ఇచ్చారు. చివరికి పరీక్షా పేపర్లు కూడా అమ్ముకున్నారనే వార్తలు వచ్చాయి. మాపై దాడులు చేస్తూనే.. మరోవైపు ఉపాధ్యాయులపై వైఎస్సార్‌సీపీ నేతలే దాడులు చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. తప్పు చేసి కూడా దబాయించాలని చూస్తున్నారు. ఇక, ఎకనామిక్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కోటాలో నకిలీ పత్రాలు సృష్టించారు. డీఎస్సీ అక్రమాల బేరసారాల వీడియోలు దొరికినా, వాటిని వదిలేసి కేవలం అనుమానితుడిపైనే కేసులు పెట్టారు. 'సెవెన్ స్టెప్స్' అంటే కూటమి ప్రభుత్వంలో వేరే అర్థం ఉంది. స్పోర్ట్స్ కోటాను దాటేసి మరీ అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టారు. తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి వీటికి పొలిటికల్ కలర్ ఇస్తున్నారు' అని ధ్వజమెత్తారు.

# జెన్‌జీలకు కొత్త గాలం! రాహుల్ గాంధీకు కౌంటర్‌గా..



దేశ రాజకీయాల్లో జెన్‌జీ చుట్టూ కొత్త ఫోకస్ కనిపిస్తోంది. విద్యార్థులు, యువత సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వరుస కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. 'చత్రోన్ కీ గూంజ్' వేదికగా విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేస్తున్నారు. దీంతో యువతను చేరుకోవడంపై అధికార, ప్రతిపక్ష శిబిరాల్లోనూ కసరత్తు మొదలైంది. ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా యువతతో మరింతగా మమేకం కావాలని ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. కేబినెట్ భేటీలతో పాటు తరచూ జరుగుతున్న పార్టీ సమావేశాల్లోనూ ఎంపీలకు, నేతలకు దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు. సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవడంతో పాటు.. ఇన్‌స్టాగ్రామ్, రీల్స్ వంటి డిజిటల్ వేదికల ద్వారా జెన్‌జీకి దగ్గర కావాలని దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే.. రాహుల్ గాంధీకి మోదీ 'తురుపుముక్క'గా భావిస్తున్న చిరాగ్ పాస్వాన్ నుంచి కౌంటర్‌కు రంగం సిద్ధమైంది. ఎన్డీయే మిత్రపక్షం లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) తాజా జెన్‌జీపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. కేంద్ర మంత్రి, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) అధినేత చిరాగ్ పాస్వాన్ యూత్ బోలె తో పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ యువత కార్యక్రమాలకు కౌంటర్ అనే చర్చ జోరందుకుంది.

### తొలి కార్యక్రమ ఉద్దేశం ఏంటంటే..

పాట్నాలోని వెటర్నరీ గ్రౌండ్‌లో 'Youth Bole To' తొలి కార్యక్రమం జరగనుంది. ఇందులో చిరాగ్ పాస్వాన్ బిహార్ యువతతో, ముఖ్యంగా జెన్‌జీ ప్రతినిధులతో నేరుగా మాట్లాడనున్నారు. విద్య, ఉద్యోగాలు, స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, టెక్నాలజీ, డిజిటల్ యుగంలో ఎదురవుతున్న సవాళ్లపై యువతతో చర్చించనున్నారు. యువత తమ ప్రశ్నలు, అభిప్రాయాలు, సూచనలను నేరుగా చిరాగ్ ముందుంచేలా కార్యక్రమాన్ని రూపొందించారు. పార్టీ బిహార్ అధ్యక్షుడు సురేంద్ర వివేక్ మాట్లాడుతూ.. యువతను ఓటుబ్యాంకుగా చూడటం లేదని, వారి సమస్యలు, ఆకాంక్షలను తెలుసుకుని వాటిపై చర్చించడమే తమ ఉద్దేశమని తెలిపారు.

### రాహుల్ ఫోకస్.. ఎన్డీయేలో కదలిక

ఇటీవలి కాలంలో రాహుల్ గాంధీ విద్యార్థులు, యువతతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. 'చత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాల్లో విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షలు, యువత భవిష్యత్తు వంటి అంశాలను ప్రస్తావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేస్తూ.. యువత సమస్యలను రాజకీయ చర్చలోకి తీసుకొస్తున్నారు. ఒకానొక దశలో ఇవి విమర్శలకు దారి తీస్తున్నప్పటికీ.. యువతను ఆకర్షిస్తున్నాయనే చర్చా నడుస్తోంది. దీంతో జెన్‌జీని ఎవరు ఎలా చేరుకుంటారన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. అటు రాహుల్ గాంధీ ప్రత్యక్ష కార్యక్రమాలతో యువతను కలుస్తుండగా.. ఇటు మోదీ ప్రభుత్వం డిజిటల్ వేదికలపై దృష్టి పెడుతోంది. ఇప్పుడు ఎన్డీయే తరఫున చిరాగ్ పాశ్వాన్ ప్రత్యక్షంగా జెన్‌జీతో సంభాషించేందుకు ప్రత్యేక వేదికను సిద్ధం చేస్తున్నారు.

### బిహార్ నుంచి యూపీకి..

చిరాగ్ వ్యూహం బిహార్‌తోనే ఆగడం లేదు. సెప్టెంబర్ 24న పాట్నా.. ఆ తర్వాత సెప్టెంబర్ 27న ప్రయాగ్‌రాజ్‌లో తదుపరి 'Youth Bole To' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆ తర్వాత యూపీలోని ఇతర నగరాల్లోనూ యువతను కలిసే కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇక్కడే ఎన్నికల లెక్కలు కూడా తెరపైకి వస్తున్నాయి. బిహార్ రాజకీయాల్లో కీలక పరిణామాలు జరుగుతున్న సమయంలో చిరాగ్ తన సొంత పార్టీకి యువతలో మరింత కనెక్ట్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు 2027లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో.. రాష్ట్రవ్యాప్తంగా యువతను చేరుకునే కార్యక్రమాలు పార్టీ విస్తరణకు ఉపయోగపడే అవకాశం ఉంది. అదే సమయంలో ఎన్నికలు జరగబోయే ఇతర రాష్ట్రాల్లోనూ ఈ తరహా కౌంటర్ కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ, మిత్రపక్షాలకు ఢిల్లీ హైకమాండ్ సూచించినట్లు తెలుస్తోంది.

### యువతే టార్గెట్.. కొత్త వ్యూహం

బిహార్‌లో మొదలై యూపీకి విస్తరించనున్న ఈ కార్యక్రమం ద్వారా చిరాగ్ లాంటి యువనేతతో.. యువతతో నేరుగా మమేకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. విద్య, ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, టెక్నాలజీ వంటి అంశాలపై జెన్‌జీతో చర్చించనున్నారు. మరోవైపు ఎన్డీయే కూడా యువతను చేరుకునే ప్రయత్నాలకు ప్రాధాన్యత ఇస్తోంది. రాహుల్ గాంధీ జెన్‌జీతో మమేకమవుతూ యువత సమస్యలను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న సమయంలో.. అధికార పక్షం కూడా యువతను చేరుకునేందుకు వివిధ మార్గాలను అనుసరిస్తోంది. ఈ నేపథ్యంలోనే చిరాగ్ పాస్వాన్ 'Youth Bole To' కార్యక్రమంతో రంగంలోకి దిగుతున్నారు. మోదీ తురుపుముక్కగా చిరాగ్ పాస్వాన్‌ను రాజకీయ వర్గాల్లో కొందరు అభివర్ణిస్తున్న నేపథ్యంలో.. ఆయన చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యంగా బిహార్ నుంచి యూపీ వరకు జెన్‌జీని ఆకట్టుకునేలా ప్రత్యక్ష కార్యక్రమాలు నిర్వహించడం.. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఎన్డీయే వ్యూహంలో భాగంగానే రాజకీయ వర్గాలు చూస్తున్నాయి.

# ఏఐ.. బుక్స్ భోంచేస్తోంది

## ఏఐ లాంగ్వేజ్ ట్రైనింగ్ మోడల్స్‌కు శిక్షణ కోసం దశాబ్దాల నాటి పుస్తకాల ధ్వంసం అందుకోసం పుస్తకాల బైండింగ్ కత్తిరిస్తున్న ఏఐ టెక్ దిగ్గజ సంస్థలు



కృత్రిమ మేధ (ఏఐ) విప్లవానికి పాత కాగిత పుస్తకాలే కీలక ఇంధనంగా మారుతున్నాయి. ఓపెన్ ఏఐ, మెటా, ఆంత్రోపిక్ వంటి టెక్ దిగ్గజాలు వేల సంఖ్యలో పాత పుస్తకాలను టోకున కొనుగోలు చేస్తూ వాటిని ఏఐ పరిపుష్టి కోసం విధ్వంసకరంగా వాడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బ్రూక్లిన్‌కు చెందిన బుక్‌బాబ్ వంటి హోల్‌సేల్ దుకాణాల నుంచి ఒక్కో విడతలో 50 వేల నుంచి లక్ష వరకు పాత పుస్తకాలను ఏఐ కంపెనీలు సేకరిస్తున్నట్లు సమాచారం.

### పాత పుస్తకాలే ఎందుకు?

ఇంటర్నెట్‌లో నాణ్యత లేని, ఏఐ రూపొందించిన సమాచారం పెరిగిపోవడంతో 'మోడల్ కొలాప్స్'ముప్పు ఏర్పడుతోంది. ఒక ఏఐ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ తన పనితీరును, తెలివితేటలను శాశ్వతంగా కోల్పోయి పనికిరాకుండా పోయే పరిస్థితే ఇది. ఈ సమస్య నుంచి గట్టెక్కడానికి ఆయా కంపెనీలు ఒక ఉపాయం ఆలోచించాయి. అదేమిటంటే.. 2022కి ప్రచురితమైన పుస్తకాలన్నీ పూర్తిగా మానవ మేధస్సును ఉపయోగించి మాత్రమే రాసినవి కావడంతో వాటిపై ఆధారపడాలని నిర్ణయించాయి. అయితే ఆయా పుస్తక రచయితలు, ప్రచురణ సంస్థల నుంచి కాపీరైట్ దావా లు పెరుగుతున్నాయి. దీంతో ఏఐ కంపెనీల కన్ను ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రాని, దశాబ్దాల నాటి పాత పుస్తకాలపై పడింది. సెకండ్ హ్యాండ్ పుస్తక షాపుల నుంచి అలాంటి పాత పుస్తకాలను చట్టబద్ధంగా కొనుక్కొనే అవకాశం ఉండటంతో ఏఐ కంపెనీలు ఈ చవకైన మార్గాన్ని ఎంచుకుంటున్నాయి. ప్రాజెక్ట్ పనామా పేరిట ఏఐ సంస్థ ఆంత్రోపిక్ ఏకంగా 1.9 లక్షల పాత పుస్తకాలను సేకరించింది. 20 లక్షల భౌతిక పుస్తకాలను సెకండ్ హ్యాండ్ మార్కెట్ల నుంచి కొనుగోలు చేయాలని ఆంత్రోపిక్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కోర్టుల్లో దాఖలైన పత్రాలు పేర్కొంటున్నాయి. ఇలా లక్షలాదిగా సేకరించిన పుస్తకాల బైండింగ్‌ను హైడ్రాలిక్ కట్టింగ్ మెషీన్లతో కత్తిరించి లక్షలాది విడి పేజీలను హైస్పీడ్ పారిశ్రామిక స్కానర్లలో వేస్తున్నారు. నిమిషాల వ్యవధిలో పేజీలన్నీ స్కాన్ అయ్యాక కాగితాలను మెషీన్లలో వేసి స్క్రాప్‌గా మార్చి రీసైక్లింగ్‌కు పంపుతున్నారు. ఈ ప్రక్రియను పుస్తక ప్రేమికులు డిస్ట్రక్టివ్ స్కానింగ్‌గా పిలుస్తున్నారు. దీనివల్ల పాత పుస్తకాలు శాశ్వతంగా అంతరించిపోతున్నాయంటున్నారు.

# మణిపూర్‌ను చక్కదిద్దలేరా!



గత మూడేళ్లుగా అనుచిత కారణాలవల్లే ఎప్పుడూ వార్తల్లో ఉంటున్న మణిపూర్ మళ్లీ ప్రతీకారేచ్ఛతో రగులుతోంది. 2023 మేలో మొదలైన జాతుల ఘర్షణలు ఎప్పుడూ పెద్దగా ఆగిందేమీ లేదుగానీ... మీడియాలో ప్రముఖంగా వచ్చేంత పెద్ద సంఘటనలు జరగలేదు. కానీ ఆ స్వల్పకాల నిశ్శబ్దం కాస్తా గత ఆదివారం బద్దలైంది. ఆ రోజు తమెంగ్లాంగ్ జిల్లాలోని టోలెన్ గ్రామంలో వేకువజామున ఒక మహిళతో సహా నలుగుర్నిదుండగులు కాల్చిచంపారు. అటుతర్వాత సాయంకాలం అదే జిల్లాలో లోంగ్పి అనే గ్రామంలో ఒక యువకుణ్ణి, మహిళను కాల్చిచంపారు. మొదటి దాడి కుకీ ప్రాబల్య గ్రామంలో నాగాలే లక్ష్యంగా జరిగితే, రెండో దాడి నాగాలు మెజారిటీగావున్నచోట కుకీలపై జరిగింది. 1992--97 మధ్య కుకీ--నాగాల ఘర్షణల్లో బలైనవారి స్మారకార్థం ఆదివారం కుకీలు 'బ్లాక్ డే' పాటించిన రోజునే ఈ రెండు దాడులూ చోటుచేసుకోవడం గమనించదగింది. మణిపూర్ పలు జాతులకు నిలయం. ఇన్ని దశాబ్దాల పాలనలో భిన్న రాజకీయపక్షాల నాయకులు గద్దెనెక్కినా, ఏ ఒక్కరూ ఆ జాతులమధ్య సామరస్య వాతావరణాన్ని నెలకొల్పలేకపోయారు. 2023 నాటి ఘర్షణల సమయంలో అప్పటి బీజేపీ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రధాన తెగలైన మెయితీ--కుకీల మధ్య పరస్పర హననం సాగుతుంటే, దాన్ని భద్రతా బలగాలకూ, కుకీ మిలిటెంట్లకూ మధ్య సాగుతున్న ఘర్షణగా చిత్రించే యత్నం చేశారు. చివరకు భద్రతా బలగాలే బీరేన్ సింగ్ ప్రకటనను ఖండించాల్సి వచ్చింది. ఆ ఘర్షణల్లో దాదాపు 300 మంది మరణించగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ వారిలో చాలా మంది సహాయ శిబిరాల్లోనే బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోంది. కొందరు ఇప్పుడిప్పుడే గ్రామాలకు వెళ్తున్న తరుణంలో మళ్లీ హింస చెలరేగింది. మెయితీల ఆధిక్యతగల ఇంఫాల్ లోయలో 2023లో వారివైపు నుంచి హింస మొదలైనప్పుడు అదుపు చేయగలిగి ఉంటే సమీప కొండ ప్రాంతాల్లోని కుకీలు రెచ్చిపోయేవారు కాదు. అయితే మూడేళ్లనాటి హింసకూ, ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సాగుతున్న హింసకూ మౌలికంగా వ్యత్యాసం ఉంది. అప్పట్లో వందలమంది గుంపులుగా ఊళ్లపైబడి దాడులు చేశారు. ఇళ్లకు నిప్పంటించటం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడటంవంటివి చోటు చేసుకున్నాయి. కానీ ఇప్పుడు చడీచప్పుడూ లేకుండా వచ్చి దాడులు చేసి పోతున్నారు. అలాగే మొన్నటివరకూ ప్రధానంగా మెయితీ--కుకీ తెగలమధ్యే ఘర్షణలుండగా, మూడు దశాబ్దాల క్రితం నాటి ఉదంతాలను గుర్తు తెస్తూ ఇప్పుడు కుకీ--నాగా జాతులమధ్య వైరం సాగుతోంది. మెయితీలు తమను సైతం గిరిజనులుగా గుర్తించాలని డిమాండ్ చేయగా, దాన్ని కుకీలు వ్యతిరేకించారు. ఇప్పుడు కుకీలు, నాగాలూ క్రైస్తవులే అయినా వారిమధ్య భూమి విషయంలో కొట్లాటలు సాగుతున్నాయి. బీరేన్ సింగ్ ప్రభుత్వం పోయి, కొన్నాళ్లు రాష్ట్రపతి పాలన కొనసాగి మొన్న ఫిబ్రవరిలో ఖేమ్‌చంద్ సింగ్ ఆధ్వర్యంలో కొత్త సర్కారు ఏర్పడింది. నిండా రెండునెలలు కూడా ప్రశాంతత లేకుండా నాగా--కుకీలమధ్య ఘర్షణలు మొదలయ్యాయి. ఒక మహిళపై అత్యాచారం కూడా చోటుచేసుకుంది. ఇవన్నీ సహాయ శిబిరాల్లో జరిగినవే. ఈ ఉదంతాలపై సమగ్ర నివేదిక కావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మరణాలపై లోగడే సర్వోన్నత న్యాయస్థానం త్రిసభ్య సంఘాన్ని నియమించగా, ఆ సంఘం 25 అసహజ మరణాలను ప్రస్తావించింది. వీటిపై జూన్ 11నుంచి వివరణ కోరుతున్నా, ఇంతవరకూ జవాబులేదని ఆ సంఘం చెప్పటంపై ధర్మాసనం దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. మృతుల వారసులకు అరకొర ఆర్థికసాయం అందించటంపైనా నిలదీసింది. మొత్తంగా 8 జిల్లాల్లోని శిబిరాల్లో 640 మంది మరణించగా, అందులో 34 మంది మరణాలు అసహజమైనవని తేలింది. కానీ 25 మృతదేహాలకు మాత్రమే పోస్టుమార్టం జరిపించారు. ఈ వరస చూస్తుంటే పాలకులు మారినా మారిందేమీ లేదని అర్థమవుతోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాలు సమగ్రంగా చర్చించుకుని తగిన కార్యాచరణకు దిగనట్టయితే అక్కడ శాంతిభద్రతలు మరింత క్షీణించటం ఖాయం.

# జిప్సీ డ్రేప్ సెట్ లో శృతిహాసన్ కొత్త అందాలు..

జిప్సీ డ్రేప్ సెట్ లో శృతిహాసన్ కొత్త అందాలు.. సినిమాలతోనే కాదు ఫ్యాషన్ సెన్స్ తో కూడా ఆడియన్స్ ను ఆకట్టుకుంటూ ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తున్న అతి కొద్ది మంది సెలబ్రిటీస్ లో శృతిహాసన్ కూడా ఒకరు . కమల్ హాసన్ కూతురిగా భారీ పాపులారిటీ అందుకున్న ఈమె తన తండ్రి ఇన్ఫ్లుయెన్స్ తో కాకుండా సొంత టాలెంట్ తో ఎదిగింది. నిత్యం సోషల్ మీడియాలో ఆకట్టుకుంటూ ఏదో ఒక అవుట్ ఫిట్ తో ఆడియన్స్ ను అలరించే ఈమె.. తాజాగా జిప్సీ డ్రేప్ సెట్ తో ఆకట్టుకుంది. ఈ మేరకు ఇన్స్టాగ్రామ్ వేదిక పంచుకున్న ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. శృతిహాసన్ ధరించిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ విషయానికి వస్తే.. లేబుల్ మోని కె అనే ఫ్యాషన్ బ్రాండ్ డిజైన్ చేసిన ఈ జిప్సీ డ్రిప్ సెట్ ను ఈమె ధరించింది. ప్రకాశవంతమైన ఊదా, గులాబీ రంగుల కలయికలో రూపొందించిన ఈ కార్సెట్.. బాడీకి అణువుగా సూట్ అయింది రంగురంగుల పూసలు, సీక్విన్ లతో ఎంబ్రాయిడరీ చేసిన ఈ కార్సెట్ ఈమె అందాన్ని రెట్టింపు చేసింది. ఇక దీనికి జతగా ముదురు ఊదా రంగులో కింది వరకు శాటిన్ క్లాత్ తో డిజైన్ చేసిన స్కర్ట్ ధరించింది. నాజుకైన నడుము భాగంతో ఆధునిక ఇండో - వెస్ట్రన్ రూపాన్ని పూర్తి చేసింది శృతిహాసన్. ఇకపోతే దీని ధర సుమారుగా రూ.24 వేల నుండి రూ.25 వేల వరకు ఉంటుంది . ఫ్యాషన్ ప్రియులకు ఇది పెద్ద ధర కాదు అనే కామెంట్లు కూడా వ్యక్తం అవుతున్నాయి. మొత్తానికి అయితే శృతిహాసన్ లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ఆడియన్స్ హృదయాలను దోచుకుంది. ఇందులో ఆమె లుక్ మాత్రమే కాదు తన మేకోవర్ ను సింపుల్ జువెలరీ , చక్కటి హెయిర్ స్టైల్ తో ఫుల్ ఫీల్ చేసుకుంది. పైగా ఈ ఫోటోలకు క్యాప్షన్ గా కొన్ని ఎమోజిస్ కి కూడా పంచుకుంది. అలా. ప్రవీణ్ రాజా స్టైల్ చేసిన ఈ లుక్.. శ్రేయ అద్దిన మేకప్.. అత్రాంగి డిజైన్ చేసిన జువెలరీ ఈమె అందాన్ని రెట్టింపు చేసేసాయి. శృతిహాసన్ విషయానికి వస్తే.. గాయనిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈమె.. అంతకుముందు కమలహాసన్ దర్శకత్వంలో తెరకెక్కిన హే రామ్ అనే చిత్రంలో బాల నటిగా తన కెరీర్ను ప్రారంభించింది. చిన్నప్పటినుండి సంగీతంపై శ్రద్ధ వహించిన ఈమె .. సింగర్ గా కూడా మంచి పేరు సొంతం చేసుకుంది. 2008లో సోహం షా దర్శకత్వంలో తెరకెక్కిన లక్ సినిమాలో ఇమ్రాన్ ఖాన్ సరసన నటిగా తొలిసారి ఇండస్ట్రీకి పరిచయమయ్యింది. ఈ సినిమా ఘోర పరాజయాన్ని చవిచూసింది. సినిమా డిజాస్టర్ అయినా.. తన నటనతో విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంది. తెలుగులో అనగనగా ఓ ధీరుడు సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన ఈమె.. గబ్బర్ సింగ్తో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది . సలార్ సినిమాతో పాన్ ఇండియా హీరోయిన్గా పేరు దక్కించుకున్న ఈమె.. ప్రస్తుతం ఆకాశంలో ఒక తార చిత్రంతోపాటు ట్రైన్, చెన్నై స్టోరీ వంటి చిత్రాలలో కీలకపాత్రలు పోషిస్తోంది





# ఈసారి హారర్ కథతో వస్తున్న అబ్బవరం దర్శకుడు







ఈసారి హారర్ కథతో వస్తున్న అబ్బవరం దర్శకుడు ఒక గ్రామం, అక్కడి నమ్మకాలు, వాటి చుట్టూ మొదలయ్యే భయం. ఈ సెటప్‌తో కొత్త ఫోక్‌లోర్ హారర్ సినిమా మొదలైంది. ప్రస్తుతం ప్రొడక్షన్ నంబర్ 3గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. మంటల్లో కనిపిస్తున్న మేక, చీకటి అడవి నేపథ్యం చూస్తే కథలో గ్రామీణ ఆచారాలు, భయానికి సంబంధించిన అంశాలు ఉండేలా కనిపిస్తోంది. కమిటీ కుర్రోళ్లు సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న ఈశ్వర్ రాచి రాజు ఇందులో హీరోగా నటిస్తున్నాడు. నందిత, లిఖిత హీరోయిన్లుగా కనిపించనున్నారు. పూజిత పొన్నాడ, సింధు కాసారం కీలక పాత్రలు చేస్తున్నారు. సురేష్ గురు, రాయల్ శ్రీ, మట్టా శివకుమార్ కామెడీ పాత్రల్లో నటిస్తున్నారు. హారర్ కథలో కూడా సరదా సన్నివేశాలకు స్పేస్ ఉండేలా టీమ్ కాస్టింగ్‌ను సిద్ధం చేసింది. ఈ సినిమాకు శ్రీధర్ గాదే దర్శకత్వం వహిస్తున్నారు. కిరణ్ అబ్బవరం ఎస్ ఆర్ కళ్యాణ మండపంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన ఈసారి పూర్తిగా వేరే జానర్ ఎంచుకున్నారు. ఆ సినిమాలో ప్రేమ, ఫ్యామిలీ ఎమోషన్స్ ఎక్కువగా ఉంటే, ఇప్పుడు గ్రామీణ ఫోక్‌లోర్ ప్రపంచంలోకి వెళ్తున్నారు. కథ, కథనం కూడా ఈ జానర్‌కు తగ్గట్టుగా కొత్తగా ఉండేలా ప్లాన్ చేసినట్టు చిత్ర బృందం చెబుతోంది. సినిమా పూజా కార్యక్రమం కూడా పూర్తయింది. నిర్మాత కొదండ రామిరెడ్డి ఈ కార్యక్రమానికి వచ్చి స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందించారు. చుట్టాలబ్బాయి దర్శకుడు వీరభద్ర కెమెరా స్విచ్ ఆన్ చేశారు. చిత్ర యూనిట్ సమక్షంలో ముహూర్తపు సన్నివేశాన్ని పూర్తి చేశారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మీ మూవీస్ బ్యానర్‌పై వెంకట్ తలారి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టైటిల్‌ను ఇంకా ప్రకటించలేదు. షూటింగ్ షెడ్యూల్, టెక్నికల్ టీమ్, మిగతా నటీనటుల వివరాలను తర్వాత వెల్లడించనున్నారు. ప్రస్తుతం బయటకు వచ్చిన పోస్టర్‌తో మాత్రం విలేజ్ హారర్ టోన్‌ను ముందే పరిచయం చేశారు. చూస్తుంటే పవర్ఫుల్ కాన్సెప్ట్ తో ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి కంటెంట్ క్లిక్కయితే బాక్సాఫీస్ వద్ద మంచి రిజల్ట్ ను అందుకుంటాయి. ఇక ఈ దర్శకుడు ఎలాంటి ట్విస్టులు ఇస్తాడో చూడాలి.

# యాక్షన్‌లో ఇరుక్కున్న కార్తికి.. మళ్లీ లవర్ బాయ్ రూట్!



యాక్షన్‌లో ఇరుక్కున్న కార్తికి.. మళ్లీ లవర్ బాయ్ రూట్! కార్తి పేరు వినగానే ఇప్పుడు యాక్షన్ సినిమాలే ఎక్కువగా గుర్తుకొస్తున్నాయి. ఖాకీ, ఖైదీ, సర్దార్ తర్వాత ఇప్పుడు సర్దార్ 2తో కూడా అదే జోన్‌లో వస్తున్నాడు. అయితే ఆయన తర్వాతి తెలుగు సినిమా మాత్రం పూర్తిగా మరో రూట్లో వెళ్లబోతోంది. ఆవారాలో తెలుగు ప్రేక్షకులు చూసిన కార్తిని మళ్లీ గుర్తు చేస్తామని నిర్మాత నాగవంశీ ఇటీవల సర్దార్ 2 ఈవెంట్ లో చెప్పాడు. తెలుగులో కార్తికి మంచి గుర్తింపు తెచ్చిన సినిమాల్లో ఆవారాకు ప్రత్యేకమైన స్థానం ఉంది. తమన్నాతో కలిసి చేసిన ఆ రోడ్ లవ్ స్టోరీ, యువన్ శంకర్ రాజా పాటలు, కార్తి లుక్ అప్పట్లో యూత్‌కు బాగా చేరాయి. తమిళంలో పైయ్యాగా వచ్చిన ఈ సినిమా తెలుగులోనూ మంచి ఆదరణ పొందింది. కార్తిని యాక్షన్ హీరోగా కాకుండా చాలా క్యాజువల్‌గా, ప్రేమలో పడిన యువకుడిగా చూసిన సినిమా అది. ఆ తర్వాత కార్తి కెరీర్‌లో జోనర్లు మారుతూ వచ్చాయి. ఖాకీలో పోలీస్ ఆఫీసర్‌గా, ఖైదీలో జైలు నుంచి బయటకు వచ్చిన వ్యక్తిగా, సర్దార్‌లో స్పైగా కనిపించాడు. ఈ సినిమాలు తెలుగులో కూడా మంచి గుర్తింపు తెచ్చాయి. మధ్యలో వేరే కథలు చేసినా, ఇటీవలి కాలంలో కార్తి పేరు చెప్పగానే యాక్షన్, సీరియస్ పాత్రలే ముందుగా గుర్తొచ్చే పరిస్థితి వచ్చింది. అందుకే నాగవంశీ ఆవారా పేరును ప్రత్యేకంగా తీసుకురావడం ఇక్కడ ఇంట్రెస్టింగ్. అప్పట్లో తెలుగు ప్రేక్షకులు ఇష్టపడిన స్టైలిష్ కార్తిని మళ్లీ చూపిస్తామని ఆయన చెప్పారు. అయితే అప్పటి కార్తిని అలాగే కాపీ చేయడం ఇప్పుడు సాధ్యం కాదు. కార్తి వయసు, కెరీర్, ఇమేజ్ అన్నీ మారాయి. కాబట్టి ఇప్పుడు ఆయనకు సరిపోయే లవర్ బాయ్ పాత్రను కొత్తగా డిజైన్ చేయాల్సి ఉంటుంది. ఈ సినిమాను మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించ బోతున్నాడు. కార్తిని లవర్ బాయ్‌గా చూపించడంతో పాటు చిన్న సూపర్ హీరో ఎలిమెంట్ కూడా ఉంటుందని నాగవంశీ చెప్పాడు. అంటే ఇది రెగ్యులర్ ప్రేమకథగా ఉండబోదు. యూత్ కామెడీతో పేరు తెచ్చుకున్న కళ్యాణ్ శంకర్ ఇప్పుడు కార్తి కోసం రొమాన్స్, కామెడీ, ఫాంటసీని ఒకే కథలో కలపబోతున్నాడు. ఆవారా వచ్చినప్పుడు కార్తి కెరీర్ మొదటి దశలో ఉన్నాడు. ఇప్పుడు ఆయనకు యాక్షన్ హీరోగా, నటుడిగా వేరే గుర్తింపు ఉంది. ఈ మధ్య ఎక్కువగా సీరియస్ పాత్రల్లో చూసిన కార్తిని మళ్లీ సరదాగా, స్టైలిష్‌గా చూపించే అవకాశం ఈ సినిమాతో దొరుకుతోంది. పైగా చిన్న సూపర్ హీరో టచ్ కూడా ఉంటుందని ముందే చెప్పేశారు కాబట్టి, కళ్యాణ్ శంకర్ కార్తి కోసం ఎలాంటి క్యారెక్టర్ ను డిజైన్ చేస్తాడో చూడాలి.

# నయన్ సెలక్షన్ లో నయా ఫార్ములా..

## అదే బిగ్ ఛాలెంజ్!



నయన్ సెలక్షన్ లో నయా ఫార్ములా.. అదే బిగ్ ఛాలెంజ్! లేడీ సూపర్ స్టార్ నయనతార అంటే ఒకప్పుడు గ్లామర్, స్టార్ హీరోల సినిమాలు, కమర్షియల్ ఎంటర్టైనర్లు గుర్తొచ్చేవి. కానీ ఇప్పుడు ఆమె సినిమా సెలక్షన్ లో ఛేంజ్ కనిపిస్తోంది. కథలో తన పాత్రకు ఎంత ఇంపార్టెన్స్ ఉంది? ఆ క్యారెక్టర్ కు ప్రేక్షకులతో ఎలాంటి కనెక్షన్ ఉంటుంది? అనే విషయాలపై నయన్ ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇదే సమయంలో ఆమెకున్న భారీ స్టార్ ఇమేజ్ మాత్రం కొత్త ఛాలెంజ్ గా మారుతోంది. నయనతార కెరీర్ ను గమనిస్తే.. హీరోయిన్ గా మొదలై లేడీ సూపర్ స్టార్ గా ఎదిగిన తీరు చాలా స్పెషల్. స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తూనే.. లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో కూడా తన మార్కెట్ ను క్రియేట్ చేసుకుంది. ఒక స్టేజ్ లో హీరో లేకపోయినా నయనతార పేరు మీద సినిమాకు ఓపెనింగ్స్ వచ్చే రేంజ్ కు చేరుకుంది. దీంతో ఆమెను దృష్టిలో పెట్టుకుని కథలు తయారయ్యే పరిస్థితి కూడా వచ్చింది. అయితే ఇప్పుడు ఆ ఇమేజ్ నే మెయింటైన్ చేయడం ఆమెకు పెద్ద సవాల్‌గా మారుతోంది.

నయనతార నుంచి ఆడియన్స్ కేవలం మంచి యాక్టింగ్ ను మాత్రమే ఆశించడం లేదు. ఆమె స్థాయికి తగ్గ రోల్, స్ట్రాంగ్ స్టోరీ, స్పెషల్ కాన్సెప్ట్ ను కోరుకుంటున్నారు. అంటే.. సాధారణ హీరోయిన్ పాత్రలో కనిపిస్తే సరిపోని పరిస్థితి. అదే సమయంలో ప్రతి సినిమాను లేడీ ఓరియెంటెడ్ గా మార్చడం కూడా పాజిబుల్ కాదు. ఇక్కడే నయన్ కొత్త సెలక్షన్ ఫార్ములా ఇంట్రెస్టింగ్ గా మారుతోంది. ఒకవైపు కమర్షియల్ సినిమాల్లో భాగమవుతూనే.. మరోవైపు తన రోల్ కు స్పెషాలిటీ ఉన్న ప్రాజెక్టులను సెలెక్ట్ చేసుకుంటోంది. పెద్ద హీరోతో సినిమా అయినా, హీరోయిన్ చుట్టూ తిరిగే కథ అయినా.. తన పాత్రకు గుర్తుండిపోయే స్పేస్ ఉండేలా చూసుకుంటున్నట్టు కనిపిస్తోంది. మరో ఛేంజ్ కూడా ఉంది. గతంలో నయన్ ను స్క్రీన్ పై చూడటమే ప్రేక్షకులకు పెద్ద అట్రాక్షన్. ఇప్పుడు మాత్రం ఆమె రోల్ ఎలా ఉంటుంది? ఆ రోల్ ఏం చేస్తుంది? కథను ఎంతవరకు ముందుకు తీసుకెళ్తుంది? అనే ప్రశ్నలు కూడా కీలకంగా మారాయి. అంటే స్టార్ నయనతార కంటే.. నటిగా నయనతారను చూపించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. అయితే ఇక్కడే అసలు బిగ్ ఛాలెంజ్ ఉంది. ఆమె స్టార్ డమ్ ఎంత పెరిగితే.. రోల్స్ పై అంచనాలు కూడా అంతే పెరుగుతాయి. కొత్తగా కనిపించాలని ప్రయత్నిస్తే కొందరు ప్రేక్షకులు కనెక్ట్ కావాలి. కమర్షియల్ గా వెళ్లాలంటే మరికొందరి అంచనాలను అందుకోవాలి. ఆ రెండింటి మధ్య బ్యాలెన్స్ చేయడం అంత ఈజీ కాదు. ప్రస్తుతం నయనతార ముందున్న అసలు పరీక్ష ఇదే. స్టార్ ఇమేజ్ తగ్గించకుండా.. నటిగా కొత్తదనాన్ని చూపించాలి. తనకు ఇప్పటికే ఉన్న మార్కెట్ కాపాడుకుంటూనే.. కొత్త జెనరేషన్ కు కూడా కనెక్ట్ అయ్యే రోల్స్ ఎంచుకోవాలి. ఆమె సెలక్షన్ లో కనిపిస్తున్న ఆ కొత్త ఫార్ములా ఎంతవరకు వర్కౌట్ అవుతుందనేది రాబోయే సినిమాలతోనే తేలనుంది.



# కాకా..దాదా..రాకా టైటిల్స్ తోనే దడ పుట్టిస్తున్నారుగా!

కాకా..దాదా..రాకా టైటిల్స్ తోనే దడ పుట్టిస్తున్నారుగా! సినిమా విజయానికి కథ, కథనాలతో పాటుగా ప్రేక్షకులను ఆకట్టుకునే టైటిల్ కూడా అంతే ముఖ్యం. మేకర్స్ క్యాచీగా ఉండే టైటిళ్ల కోసం ప్రత్యేకంగా అన్వేషిస్తుంటారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం చిత్రసీమలో రెండు అక్షరాల టైటిళ్ల హవా నడుస్తోంది.



తాజాగా ముగ్గురు కథానాయకుల సినిమాలకు -కాకా-, -దాదా-, -రాకా- అనే వినూత్నమైన టైటిళ్లు ఖరారు కావడం.. అవన్నీ ఒకే రకమైన ప్రాసతో ఉండటం సినీ ప్రియుల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తోంది. యాదృచ్ఛికంగా కుదిరిన మూడు టైటిళ్లు ప్రకటించినప్పటి నుంచే నెట్టింట సందడి చేస్తున్నాయి. రెండు అక్షరాల ప్రాసతో కూడిన పేర్లు పలకడానికి సులువుగా, వినడానికి అత్యంత పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. షార్ట్ అండ్ స్వీట్‌గా ఉన్న టైటిల్స్ అనౌన్స్‌మెంట్‌తోనే చిత్రాలపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. సాధారణంగా ఇలాంటి రైమింగ్ టైటిల్స్ ఒకే సమయంలో రావడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. ఈ చిత్రాల్లోని మాస్ ఎలిమెంట్స్, కథా నేపథ్యాలు కూడా ఆ టైటిళ్లకు తగ్గట్లే అత్యంత ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. -కాకా-, -దాదా-, -రాకా- అనే పదాలు సాధారణంగా స్థానిక (మాస్) భాషలో పవర్‌ఫుల్ క్యారెక్టర్లను.. నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తులను సూచించడానికి ఉపయోగిస్తారు. దీంతో ఈ చిత్రాల్లో హీరోల పాత్రలు ఎంతో రగ్గడ్‌గా, యాక్షన్ ఓరియెంటెడ్‌గా ఉంటాయనే సంకేతాలను టైటిల్స్ ద్వారానే దర్శకులు హింట్0 ఇచ్చేశారు. నేటి తరం ప్రేక్షకులు సుదీర్ఘమైన పేర్ల కంటే కూడా గుర్తుంచుకోవడానికి వీలుగా ఉండే క్యాచీ టైటిళ్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో హ్యాష్‌ట్యాగ్‌లు క్రియేట్ చేయడానికి, ప్రచార చిత్రాలకు ఈ తరహా చిన్న టైటిళ్లు బాగా ఉపయోగపడతాయి. ఈ వ్యూహంతోనే నిర్మాతలు, దర్శకులు మునుపటి కంటే భిన్నంగా రెండు అక్షరాల పేర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. -కాకా- తో చిరంజీవి....-దాదా-తో బాలయ్య...-రాకా-తో బన్నీ ఇప్పటికే పట్టాలెక్కేసిన సంగతి తెలిసిందే. మూడు సినిమా సినిమా షూటింగ్ లు శర వేగంగా జరుగుతున్నాయి. ఈ వరుసలో ముందుగా బన్నీ-అట్లీ అండ్ కో.. తమ సైన్స్ ఫిక్షన్ కథకు -రాకా-గా ప్రకటించారు. ఆ తర్వాత కొన్ని నెలలకు చిరంజీవి అండ్ కో -కాకా- గా ఫిక్స్ అయ్యారు. తాజాగా నటసింహ బాలయ్య-గోపీచంద్ మలినేని అండ్ కో -దాదా-గా ఫిక్స్ అయ్యారు.మరి బాక్సాఫీస్ వద్ద ఈ -కాకా-, -దాదా-, -రాకా-ల హవా ఎలా ఉంటుందనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. అభిమాన కథానాయకులు పవర్‌బఫుల్ టైటిళ్లతో ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలని అభిమానులు ఎంతో ఆసక్తిగతా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఈ మూడు సినిమాల నుంచి విడుదలైన టైటిల్ పోస్టర్లు, గ్లింప్స్‌లు సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో నిలిచాయి.



# స్టార్ల నోటి దురద ఫలితం - కోట్లాది రూపాయల మూల్యం!

స్టార్ల నోటి దురద ఫలితం- కోట్లాది రూపాయల మూల్యం! సోషల్ మీడియా యుగంలో సెలబ్రిటీల ఒక చిన్న వ్యాఖ్యతో లేదా వీడియాలో నెగెటివ్ పోస్ట్ తో ప్రఖ్యాత సంస్థల వ్యాపారాలను, వాటి బ్రాండ్ ఇమేజ్‌ను తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఫలితంగా సంస్థలు సైతం ఏమాత్రం వెనక్కి తగ్గకుండా సదరు స్టార్లపై కోట్లాది రూపాయల నష్టపరిహారం కోరుతూ రివర్స్‌లో డిఫమేషన్ కేసులు ఫైల్ చేస్తున్నాయి. తాజాగా బాలీవుడ్ నటి నోరా ఫతేహిపై ఒక ప్రైవేట్ ఏవియేషన్ కంపెనీ కేసు నమోదు చేయగా.. గతంలోనూ పలువురు ప్రఖ్యాత సెలబ్రిటీలు బ్రాండ్లు.. వ్యాపార సంస్థల చేతిలో చట్టపరమైన చిక్కుల్లో పడ్డారు. నోరా ఫతేహి - ప్రయివేట్ ఏవియేషన్ కంపెనీ దావా: బాలీవుడ్ నటి, డాన్సర్ నోరా ఫతేహి ఇటీవల ముంబై-జైపూర్ ప్రయాణంలో తాను ప్రయాణించిన చార్టర్డ్ విమానాన్ని ఉద్దేశించి సోషల్ మీడియాలో విమర్శలు చేశారు. ఆ విమానాన్ని -టాయ్ కార్-, -లేగో ప్లేన్- (టాయ్ విమానం) అంటూ అభివర్ణిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు పోస్ట్ చేశారు. కోట్లాది మంది ఫాలోవర్లు ఉన్న నోరా వ్యాఖ్యల వల్ల తమ కంపెనీ బుకింగ్స్ 15-20 శాతం పడిపోయాయని.. వ్యాపార ప్రతిష్ట తీవ్రంగా దెబ్బతిందని ఆరోపిస్తూ సదరు ఏవియేషన్ కంపెనీ గాంధీనగర్ కోర్టులో 3 కోట్ల సివిల్ డిఫమేషన్ దావా వేసింది. వీడియోలు వెంటనే డిలీట్ చేసి.. బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది.

అంతర్జాతీయ పాప్ ఐకాన్, రియాలిటీ స్టార్ కిమ్ కర్దాషియాన్ ఫ్యాషన్ బ్రాండ్ -మిస్‌గైడెడ్- తన అవుట్‌ఫిట్ డిజైన్లను కాపీ కొట్టి అమ్మేస్తోందని.. తన పేరును అక్రమంగా వాడుకుంటోందని సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు, ఆపై కోర్టు వ్యాజ్యం తీవ్ర చర్చనీయాంశమైంది. కిమ్ వ్యాఖ్యలు తమ బ్రాండ్ వ్యాపారాన్ని దెబ్బతీశాయని సదరు బ్రాండ్ వాదించినా అంతిమంగా కోర్టు కిమ్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చి... సదరు ఫ్యాషన్ బ్రాండ్‌కు 2.7 మిలియన్ల డాలర్ల నష్టపరిహారం విధించింది. హాలీవుడ్ ర్యాపర్ కాన్యే వెస్ట్ ప్రసిద్ధ బ్రాండ్ అడిడాస్.. ఇతర బ్రాండ్లను ఉద్దేశించి.. సంస్థల నిర్వహణపై బహిరంగంగా వివాదాస్పద , అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఫలితంగా అడిడాస్ కంపెనీ ఆయనతో ఉన్న బిలియన్ డాలర్ల స్నీకర్ డీల్‌ను రద్దు చేసుకోవడమే కాకుండా.. బ్రాండ్ ఇమేజ్‌కు చేకూర్చిన నష్టానికి భారీ స్థాయిలో చట్టపరమైన నష్టపరిహార ప్రక్రియను ప్రారంభించింది.

సెలబ్రిటీ ఎండోర్స్‌మెంట్లు - కాంపిటీషన్ కమిషన్ అండ్ బ్రాండ్ కేసులు: భారతదేశంలోనూ పలువురు ప్రముఖ స్టార్లు (అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, ఎంఎస్ ధోని వంటి వారు) తాము ప్రచారం చేసిన ప్రాజెక్టులు లేదా బ్రాండ్లు ( రియల్ ఎస్టేట్, లెర్నింగ్ యాప్స్) విఫలమైనప్పుడు లేదా తప్పుడు వ్యాఖ్యలు చేసినప్పుడు రివర్స్ విమర్శలు- బ్రాండ్ ప్రతిష్ట దెబ్బతిన్నందుకు నష్టపరిహారం- చట్టపరమైన వివాదాల్లో చిక్కుకున్నారు. బ్రాండ్ ఒప్పందాలను ఉల్లంఘించి ఇతర పోటీ సంస్థలను పొగడటం లేదా అసత్య ప్రచారాలు చేయడం వల్ల బ్రాండ్లు స్టార్లకు చట్టపరమైన నోటీసులు జారీ చేసిన సంఘటనలు ఉన్నాయి. సామాజిక మాధ్యమాల్లో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లు ఉన్న స్టార్స్ చేసే వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత అభిప్రాయాలుగా మిగిలిపోకుండా.. కంపెనీల కోట్లాది రూపాయల వ్యాపారాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అందుకే ఇప్పుడు గ్లోబల్ బ్రాండ్లు - ఏవియేషన్ కంపెనీలు సెలబ్రిటీల -నోటిదురద-ను చట్టపరంగా ఎదుర్కొంటూ భారీ డిఫమేషన్ కేసులతో బుద్ధి చెబుతున్నాయి. ముక్కు పిండి కోట్లాది రూపాయల నష్టపరిహారాన్ని గుంజుకుంటున్నాయి.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.